# విశాల భారతి

తెలుగు దినపత్రిక

21-04-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 110





## భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల మోత

- భూముల ప్రభుత్వ ధరలు 30-50శాతం పెంచేందుకు కసరత్తు
- ఏటా రూ. 3,600 కోట్ల అదనపు రాబడిపై కన్ను
- మార్కెట్ ధరలకు, రికార్డు ధరలకు మధ్య అగాధాన్ని పూడ్చడమే లక్ష్యం
- భారం తగ్గించేందుకు స్టాంప్ డ్యూటీ 1శాతం తగ్గించే ఛాన్స్
- మహిళల పేరిట రిజిస్ట్రేషన్లకు అదనపు రాయితీ ప్రతిపాదన
- ప్రాజెక్టుల నిర్వహణ, ఖజానా పెంపు కోసమే ఈ నిర్ణయం

03



తెలంగాణ అస్తిత్వం అంటే అది కేవలం ఒక భౌగోళిక సరిహద్దు కాదు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది అమరవీరుల బలిదానాలు, సకల జనుల ఆత్మత్యాగాల పునాదులపై నిర్మితమైన ఒక గొప్ప ఆకాంక్ష. స్వరాష్ట్ర సాధన కోసం పిడికిలి బిగించిన నినాదాలు, రహదారులపై జరిగిన మిలియన్ మార్చ్‌లు, పల్లె పల్లెనా సాగిన వంటా వార్పులు ఈ నేల పౌరుషానికి ప్రతీకలు. సబ్బండ వర్ణాలు ఏకమై తమ అస్తిత్వం కోసం ఉద్యమించిన తీరు యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. అటువంటి మహోన్నత ఆశయాలతో సిద్ధించిన రాష్ట్రంలో నేడు చోటుచేసుకుంటున్న పరిణామాలు, ప్రజాప్రతినిధుల మధ్య సాగుతున్న వాగ్వాదాలు చూస్తుంటే సామాన్య పౌరులకు జాలి కలుగుతోంది. తెలంగాణ సమాజం అంటే మర్యాదలకు, సంప్రదాయాలకు పెట్టింది పేరు. ఇక్కడ మనుషుల మధ్య ఉండే అనురాగం ఎంత గొప్పదో, ఆత్మగౌరవానికి భంగం కలిగితే వ్యక్తమయ్యే ఆగ్రహం కూడా అంతే తీవ్రంగా ఉంటుంది. ఉద్యమ కాలంలో అడ్డుపడిన శక్తులకు ప్రజలు తమదైన శైలిలో బుద్ధి చెప్పారు. అటువంటి సామాజిక ఐక్యత, విద్వత్తు ఉన్న ఈ గడ్డపై ప్రస్తుతం రాజకీయ నాయకులు ఉపయోగిస్తున్న భాష, ప్రవర్తిస్తున్న తీరు తీవ్ర ఆవేదన కలిగిస్తోంది.

# నేతల బూతుల రాజకీయం!

## విధానాలు వదిలి వ్యక్తిగత దూషణలకు దిగడం దురదృష్టకరం

పోరాడి తెచ్చుకున్న రాష్ట్రం ఇలాంటి దిగజారుడు రాజకీయాల కోసమేనా అనే ప్రశ్న ప్రతి సామాన్యుడి మెదడులో తలెత్తుతోంది. రాజకీయ నాయకుల ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోయాయి. ప్రజల సంక్షేమం, అభివృద్ధి అనేది కేవలం ఎన్నికల ప్రచారాలకే పరిమితమైన మాటలుగా మిగిలిపోయాయి. కేవలం అధికారం కోసం పాకులాడటం, తమ రాజకీయ ప్రాపకాన్ని కాపాడుకోవడం కోసమే నిత్యం ప్రయత్నిస్తున్నారు. 2014లో దేశంలోనే మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. ఆర్థికంగా ఎంతో బలంగా ఉన్న రాష్ట్రం నేడు రెవెన్యూ లోటులోకి కూరుకుపోవడం విచారకరం. దశాబ్ద కాలం పాలించిన గత ప్రభుత్వం దిగిపోయే నాటికి ఖజానా ఖాళీ అయిపోయిందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత పాలనలో సైతం ఆర్థిక పరిస్థితులు మెరుగుపడిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రభుత్వ సేవలో దశాబ్దాల కాలం పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి.

- జగిత్యాల సభలో కాంగ్రెస్ నేతలపై కేసీఆర్ అసభ్య పదజాలం
- కేసీఆర్‌ను కర్కోటకుడు, ద్రోహి అంటూ రేవంత్ తీవ్ర విమర్శలు
- మద్యం ఆదాయం లేనిదే జీతాలివ్వలేని స్థితికి రాష్ట్ర ఖజానా
- అధికారం కోసం పాకులాడుతూ తెలంగాణ పరువు తీస్తున్నారు
- ఇలాంటి తిట్ల రాజకీయాల కోసం కాదు తెలంగాణ తెచ్చుకుంది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమవడాన్ని బట్టి ఆర్థిక వ్యవస్థ ఎంతటి సంక్షోభంలో ఉందో స్పష్టమవుతోంది. త్యాగాల మీద ఏర్పడిన రాష్ట్రం ఈ స్థితికి చేరడానికి రాజకీయ నాయకుల స్వార్థం, భారీగా సంపదను వెనకేసుకోవాలనే ఆరాటం ప్రధాన కారణాలని ప్రజలు భావిస్తున్నారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంపైనే ప్రభుత్వ జీతాల చెల్లింపు ఆధారపడి ఉండటం కఠిన వాస్తవం. నాయకుల వ్యవహార శైలి వల్ల తెలంగాణ పరువు జాతీయ స్థాయిలో దెబ్బతింటోంది. ఇటీవల జగిత్యాల వేదికగా జరిగిన బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయి. ప్రతిపక్ష నాయకులను ఉద్దేశించి ఆయన వాడిన పదజాలం, ఎదుటివారిని వ్యక్తిగతంగా దూషించడం చూస్తుంటే ఆయన స్థాయికి అది తగదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కఠినంగా మాట్లాడటం వేరు, కానీ అసభ్యకరమైన పదాలను వాడటం ప్రజాస్వామ్యంలో ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. గతంలో కూడా ఆయన నోటి నుంచి వచ్చిన కొన్ని వ్యాఖ్యలు సమాజాన్ని విస్మయానికి గురిచేశాయి. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అదే ధోరణిని అనుసరిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో జరిగిన సభలో ఆయన సీనియర్ నేత జీవన్ రెడ్డిని ఉద్దేశించి తీవ్రమైన విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి నిష్క్రమించిన నేతలను మిగతా 3లో..

## హైడ్రాను ఎత్తి అవతల పడేస్తా

- వెయ్యి జన్మలెత్తినా నేను చావను.. రేవంత్‌కు కేసీఆర్ గట్టి కౌంటర్
- అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తి అవతల పారేస్తామని ప్రకటన
- తమ పాలనలో వెలుగులు.. ఇప్పుడు చీకట్లు ఎందుకని ప్రశ్న
- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా జీవన్ రెడ్డి నియామకం
- రైతుబంధు, పెన్షన్లపై కాంగ్రెస్ మాట తప్పిందని కేసీఆర్ విమర్శ
- హెలికాప్టర్ వద్దకు డ్రోన్.. కేసీఆర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో గులాబీ జెండా మరోసారి రెపరెపలాడింది. సుదీర్ఘ విరామం తర్వాత బీఆర్ఎస్ అధినేత, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జగిత్యాల గడ్డపై అడుగుపెట్టడంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. పదేళ్ల సుదీర్ఘ పాలనలో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన కేసీఆర్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా భారీ బహిరంగ సభను నిర్వహించారు. సుమారు 1,00,000 మందికి పైగా హాజరైన ఈ సభ కేవలం రాజకీయ చేరికలకే పరిమితం కాకుండా, రాబోయే ఎన్నికలకు శంఖారావంగా మారింది. పార్టీ రజతోత్సవ వేళ నిర్వహిస్తున్న ఈ సభతో కేడర్‌లో కొత్త ఉత్సాహం ఉరకలేస్తోంది. గులాబీ శ్రేణులు జై తెలంగాణ నినాదాలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించాయి. సభలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన అంశం కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం. నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో మిగతా 2లో..



## కాళేశ్వరంపై క్లారిటీ ఇవ్వని కేసీఆర్

- మేడిగడ్డపై రేవంత్ విమర్శలకు కేసీఆర్ బదులివ్వలేదు
- అధికారంలోకి రాగానే హైడ్రా రద్దు చేస్తామనడం విడ్డూరం
- పాత విషయాలే చెప్పడంతో స్పీచ్‌లో వాడి తగ్గింది
- తన చావు కోరుకుంటున్నారనే పాత మాటలే వాడారు
- కేసీఆర్ తనదైన పొలిటికల్ టచ్ కోల్పోయినట్లుంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో తనదైన వాక్చాతుర్యంతో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే గులాబీ దళపతి కమలాకర్ రావు జగిత్యాల సభలో మాత్రం ఆ పాత ముద్రను ప్రదర్శించలేకపోయారు. సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించేందుకు ఏర్పాటు చేసిన ఈ బహిరంగ సభ సాదాసీదాగా ముగియడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న కీలక చర్చలను పక్కనపెట్టి కేవలం గత వైభవాల గురించి చెప్పుకోవడానికే ఆయన మిగతా 2లో..

## 20 నెలలు నా ఉసురు పోసుకున్నారు



- కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డి
- రేవంత్ తన ఉసురు తీశారని, తీవ్రంగా వేధించారని ఆవేదన
- తెలంగాణ బాగుపడాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని పిలుపు
- హస్తం పార్టీ పీడ వదలాలంటే గులాబీ జెండా ఎగరాలన్న నేత
- కేసీఆర్‌తో తనకున్న దశాబ్దాల అనుబంధంపై గుర్తు
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పతనం తప్పదని జోస్యం

02




03

## ఆర్టీసీ అయిపోయింది.. ఇక MMTS వంతు!

- భాగ్యనగరంలో ఎంఎంటిఎస్ ప్రయాణం ఫ్రీ చేసేలా ప్రభుత్వ ప్లాన్
- రైల్వే ఆదాయ లోటు రూ. 10 కోట్లు భరిస్తామని సీఎస్ లేఖ
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓట్ల కోసమే ఈ నిర్ణయమని విమర్శలు

## కేసీఆర్.. నువ్వో.. నేనో తేల్చుకుందాం

- రెండో విడత రైతు భరోసా రూ. 5,700 కోట్లు విడుదల
- ఏడాదిలోపే రూ. 22 వేల కోట్ల రుణమాఫీ చేశామని వెల్లడి
- పదవి కోసం పార్టీని, కార్యకర్తలను మోసం చేశారని ఆగ్రహం
- కేసీఆర్ ప్రతిపక్ష హోదా ఊడగొడతా.. 2029లో తేల్చుకుందాం
- ఫామ్‌హౌస్ పాలన పోయి ప్రజాపాలన వచ్చిందని విమర్శ
- 70 వేల ఉద్యోగాలు, సన్నబియ్యం పంపిణీపై సీఎం స్పష్టీకరణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయ యవనికపై రైతే కేంద్రబిందువుగా సాగుతున్న పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో కీలక అడుగు వేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్ పల్లి వేదికగా జరిగిన 'రైతు ఉత్సవాల' బహిరంగ సభలో ఆయన చేసిన ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. గత పదేళ్ల దొరల పాలనను అంతమొందించి, ప్రజా ప్రభుత్వాన్ని మిగతా 3లో..



## మెదక్ రైతులను ముంచిన అకాలవర్షం

- ఈదురుగాలులు, వడగండ్ల వానతో వరి, మామిడి పంటలు ధ్వంసం
- సంగారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల్లో పిందెలు, కాయలు నేలరాలాయి
- మెదక్ జిల్లాలో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది
- దాదాపు 4,777 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనా

07





## ఏదో తేడాగుందే హరిషా..!

- కేసీఆర్ జగిత్యాల సభకు హరీష్ రావు దూరం
- కీలక నేతలతో కలిసి హుటాహుటిన ఢిల్లీకి
- పార్టీలో చీలికపై రాజకీయ వర్గాల్లో చర్చ
- హరీష్ బీజేపీతో టచ్‌లో ఉన్నారని ఆరోపణ
- న్యాయపరమైన పనులపైనే వెళ్లారని స్పష్టీకరణ
- ఈ పరిణామం గులాబీ పార్టీలో పెను సంచలనం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** జగిత్యాల వేదికగా గులాబీ అధినేత కేసీఆర్ సుదీర్ఘ విరామం తర్వాత నిర్వహించిన భారీ బహిరంగ సభ రాజకీయంగా కొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మిగతా 2లో..

## ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఆలస్యం ఉండదు

- తెలంగాణ వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్
- ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేయడానికి ప్రభుత్వం సహకారం
- రామగుండంలో యూరియా ఉత్పత్తి, సరఫరాపై సమీక్ష ఫీల్డ్ స్థాయిలో పరిశీలన

04

# ఏదో తేడాగుందే హరీషా..!

**మొదటిపేజీ తరువాయి**

పార్టీ పట్టును మళ్లీ నిరూపించుకోవాలని భావించిన ఈ తరుణంలో, పార్టీకి అత్యంత కీలకమైన నేత హరీష్ రావు గైర్హాజరు కావడం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. సభా ప్రాంగణంలో గులాబీ శ్రేణులు కేసీఆర్ రాకతో ఉత్సాహంగా ఉన్నప్పటికీ, స్టేజీపై ట్రబుల్ షూటర్ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. ముఖ్యంగా ఎన్నికల అనంతర పరిణామాల్లో కేసీఆర్ రీలాంచ్ సభగా భావిస్తున్న ఈ కార్యక్రమానికి హరీష్ రావు వంటి నాయకుడు దూరం కావడం వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. హరీష్ రావు ఒక్కరే కాకుండా, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ వినోద్ కుమార్ కూడా హుటాహుటిన ఢిల్లీకి పయనం కావడం ఈ వ్యవహారాన్ని మరింత జటిలం చేసింది. సాధారణ పరిస్థితుల్లో ఇలాంటి పర్యటనలు ప్రాధాన్యతను సంతరించుకోవు కానీ, కేసీఆర్ కీలకమైన సభకు సరిగ్గా ఒకరోజు ముందు ఈ ముగ్గురు నేతలు దేశ రాజధానికి వెళ్లడం వెనుక గులాబీ గూటిలో ఏదో జరుగుతోందనే సంకేతాలు వెలువడుతున్నాయి. జగిత్యాల సభ ద్వారా తన ఉనికిని మళ్ళీ చాటుకోవాలని కేసీఆర్ యత్నిస్తున్న సమయంలో, పార్టీలో నంబర్ టూ స్థానంలో ఉన్న నేత అందుబాటులో లేకపోవడం రాజకీయ విశ్లేషకుల దృష్టిని ఆకర్షిస్తోంది. పార్టీ అంతర్గత విభేదాలు మళ్లీ మొదటికి వచ్చాయా అనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ పరిణామాలపై అధికార కాంగ్రెస్ పార్టీ అప్పుడే తనదైన శైలిలో విమర్శల అస్త్రాలను ఎక్కుపెట్టింది. బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందని, నాయకత్వ మార్పు కోరుకునే వర్గం తిరుగుబాటు బావుటా ఎగురవేస్తోందని ప్రచారం చేస్తోంది. మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి వంటి నేతలు పార్టీలోకి రావడంపై హరీష్ రావు అసంతృప్తితో ఉన్నారని, అందుకే వ్యూహాత్మకంగా ఈ సభకు దూరమయ్యారని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అసమ్మతి సెగలు పార్టీని ముంచేస్తున్నాయని, త్వరలోనే బీఆర్ఎస్ నుంచి భారీ వలసలు ఉంటాయని ఆ పార్టీ నాయకులు జోస్యం చెబుతున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్ శ్రేణుల్లో కొంత ఆందోళనను నింపుతుండగా, ప్రత్యర్థి పార్టీలకు మాత్రం రాజకీయ ఆయుధంగా మారింది. రాజకీయ ప్రచారాలు ఒకవైపు ఉంటే, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసినట్లు మారాయి. హరీష్ రావు బీజేపీ అగ్రనేతలతో మంతనాలు జరుపుతున్నారని, అందుకే ఢిల్లీకి వెళ్లారంటూ ఆయన సంచలన ఆరోపణలు చేశారు. గత కొంతకాలంగా హరీష్ రావు పార్టీలో తన ప్రాధాన్యత తగ్గుతోందనే అసహనంతో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ వారసుడిగా కేటీఆర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్న తరుణంలో, పార్టీలో





తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని కాపాడుకుంటూ వస్తున్న హరీష్ రావు, ఇప్పుడు తన రాజకీయ భవిష్యత్తు కోసం కొత్త దారులను వెతుక్కుంటున్నారా అనే కోణంలో చర్చ మొదలైంది. బీజేపీ వైపు ఆయన చూపు ఉందనే మాటలు గులాబీ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ అధికార ప్రతినిధులు, కేసీఆర్ సన్నిహితులు మాత్రం ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, ఢిల్లీ పర్యటన అనేది కేవలం పార్టీ అధినేత ఆదేశాల మేరకే జరిగిందని వారు స్పష్టం చేస్తున్నారు. ఏప్రిల్ 22న కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపులు జరపడం అత్యవసరమని పార్టీ వివరణ ఇచ్చింది. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన న్యాయ పోరాటం కోసమే హరీష్ రావు, వినోద్ కుమార్, రవిచంద్ర ఢిల్లీలో ఉన్నారని, దీనిని రాజకీయంగా చూడటం సరికాదని వారు చెబుతున్నారు. పార్టీకి వెన్నుముకగా ఉండే నేతలు ఎప్పుడూ అధినేత మాటకు కట్టుబడి ఉంటారని వారు పేర్కొంటున్నారు. అయితే పార్టీ చెబుతున్న కారణాలపై రాజకీయ నిపుణులు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేదా ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు ఎంత ముఖ్యమైనవి అయినప్పటికీ, కేసీఆర్ బహిరంగ సభకు కొద్ది గంటల ముందు ఇంత హడావుడిగా ఢిల్లీకి వెళ్లాల్సినంత అత్యవసరం ఏముందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ఒకవేళ న్యాయపరమైన సలహాలు తీసుకోవాలనుకుంటే, జగిత్యాల సభ ముగిసిన తర్వాత కూడా వెళ్లొచ్చు కదా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. జగిత్యాల వంటి ప్రతిష్టాత్మక సభలో హరీష్ రావు లాంటి నాయకుడు ఉంటే కార్యకర్తల్లో మరింత జోష్ వచ్చేదని, ఆయన గైర్హాజరు వల్ల సభ ప్రభావం కొంత తగ్గిందని విశ్లేషణలు సాగుతున్నాయి. ఇక్కడ గమనించాల్సిన మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, ఒకవేళ కేసీఆరే వారిని ఢిల్లీకి పంపించినా దాని వెనుక లోతైన రాజకీయం ఉండి ఉండవచ్చు. తన సభకు హరీష్ రావు లాంటి క్రౌడ్ పుల్లర్ అవసరం లేదని కేసీఆర్ భావించి ఉండవచ్చని ఒక వర్గం వాదిస్తోంది. పార్టీపై తన పట్టు ఇంకా చెక్కుచెదరలేదని నిరూపించుకోవాలని, తన సొంత ఇమేజ్ తోనే ప్రజలను ఆకట్టుకోవాలని కేసీఆర్ భావించి ఉండవచ్చు. అంటే హరీష్ రావుకు ప్రాధాన్యత తగ్గించడం ద్వారా పార్టీలో నాయకత్వ శ్రేణిపై ఒక స్పష్టమైన సంకేతం ఇవ్వాలని ఆయన యోచించారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఇది కేవలం న్యాయపరమైన పర్యటన కాదని, వ్యూహాత్మకమైన దూరం అని కొందరు అంచనా వేస్తున్నారు. రెండవ కోణం ప్రకారం, హరీష్ రావే స్వయంగా ఈ సమయాన్ని ఎంచుకుని ఢిల్లీకి వెళ్లి ఉంటే, అది పార్టీ నాయకత్వంతో ఆయనకు ఉన్న భారీ అంతరాన్ని బహిర్గతం చేసినట్లే అవుతుంది. ముఖ్యంగా టి. జీవన్ రెడ్డి చేరిక వంటి కీలక నిర్ణయాల్లో తనను సంప్రదించలేదనే కోపం ఆయనలో ఉండవచ్చని సమాచారం. తన రాజకీయ ప్రాబల్యం ఉన్న జిల్లాలో తనకు తెలియకుండా నిర్ణయాలు తీసుకోవడం ఆయనకు రుచించడం లేదని తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సభకు దూరంగా ఉండటం ద్వారా అధిష్టానానికి నిరసన తెలియజేయాలని ఆయన భావించి ఉండవచ్చు. ఇది నిజమైతే, భవిష్యత్తులో బీఆర్ఎస్ లో మరిన్ని పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. తెలంగాణ రాజకీయాల్లో హరీష్ రావు పాత్ర ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన అధ్యాయంగా ఉంటుంది. పార్టీ ఆవిర్భావం నుండి కేసీఆర్ నీడలా ఉంటూ, ప్రతి క్లిష్ట సమయంలోనూ పార్టీని ఆదుకున్న చరిత్ర ఆయనది. అలాంటి నాయకుడు నేడు పార్టీ ప్రధాన వేదికలపై కనిపించకపోవడం అనేది కేవలం యాదృచ్ఛికం అని ఎవరూ నమ్మడం లేదు. జగిత్యాల వేదికగా కేసీఆర్ చేసిన ప్రసంగంలో ఆత్మవిశ్వాసం కనిపించినా, తెర వెనుక జరుగుతున్న ఈ పరిణామాలు పార్టీ శ్రేణుల్లో అయోమయానికి గురిచేస్తున్నాయి.

# హైడ్రాను ఎత్తి అవతల పడేస్తా

**మొదటిపేజీ తరువాయి**

కొనసాగిన ఆయనకు కేసీఆర్ స్వయంగా గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన తొలి రోజే ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి కల్పించడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. జగిత్యాల నుంచి ఆదిలాబాద్ వరకు ఆయన సేవలను వాడుకుంటామని, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చాక మరింత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఈ చేరికతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ బలం రెట్టింపు అయ్యిందని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రసంగం ప్రారంభంలోనే కేసీఆర్ తనదైన శైలిలో విమర్శల బాణాలు వదిలారు. హైదరాబాద్‌లో సంచలనం సృష్టిస్తున్న 'హైడ్రా' అంశంపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చుతున్న ఈ వ్యవస్థను తాము అధికారంలోకి రాగానే ఎత్తి అవతల పడేస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నారని, ఇది సామాన్య ప్రజల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాము ఇళ్లను క్రమబద్ధీకరిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కూల్చివేతలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సర్కారుపై విరుచుకుపడుతూ, పేదల ఉసురు పోసుకోవద్దని హెచ్చరించారు. రైతు సంక్షేమం గురించి మాట్లాడుతూ గతం కంటే మెరుగైన ఫలితాలు రావడం లేదని కేసీఆర్ విశ్లేషించారు. గతంలో 10 రోజుల్లోనే రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేవారమని గుర్తుచేశారు. తాము రూ. 10,000 ఇస్తుంటే, కాంగ్రెస్ వారు రూ. 15,000 ఇస్తామని నమ్మించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు వేసే సమయంలో ప్రజలను హెచ్చరించినా, కొందరు వినలేదని.. ఇప్పుడు అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. వ్యవసాయ రంగం కుదేలవుతోందని, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని గణాంకాలతో వివరించారు. ఈ పాలనలో రైతుల గోస చూస్తుంటే బాధగా ఉందని ఆయన అన్నారు. విద్యుత్ రంగంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశమయ్యాయి. తమ పాలనలో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉండేదని, ఇప్పుడు కోతలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించామని, ఒకవేళ నీళ్లు ఇవ్వకపోతే అప్పుడు తనను నిలదీయాలని సవాల్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఐదేళ్ల పాటు విజయవంతంగా నడిచిన ఈ పథకానికి



ఇప్పుడు ఏ రోగం వచ్చిందని నిలదీశారు. ప్రస్తుత ప్రభుత్వానికి పాలన చేతకాక కేవలం దూషణలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ చావాలని కొందరు కోరుకుంటున్నారని, కానీ ప్రజల దీవెనలు ఉన్నంతవరకు తనను ఎవరూ ఏమీ చేయలేరని ఉద్వేగంగా మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందున్న దుర్భర పరిస్థితులను, ఆకలి కేకలను కేసీఆర్ మరోసారి స్మరించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని, వివక్షను అంకెల్లో వివరిస్తూ ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిల్చారు. పద్నాలుగేళ్ల పోరాటం తర్వాత సాధించుకున్న రాష్ట్రాన్ని పదేళ్లలో అభివృద్ధి చేశామని, కానీ ఇప్పుడు మళ్లీ పాత రోజులు గుర్తొస్తున్నాయని ఆవేదన చెందారు. తెలంగాణ చరిత్రను భావి తరాలకు గుర్తుచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణ స్వయంప్రతిపత్తిని కాపాడటంలో బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. జీవన్ రెడ్డితో తనకున్న 40 ఏళ్ల సుదీర్ఘ అనుబంధాన్ని కేసీఆర్ కొనియాడారు. రాజకీయంగా భిన్న దృక్పథాలు ఉన్నా, వ్యక్తిగతంగా ఒకరినొకరు గౌరవించుకున్నామని తెలిపారు. అలిశెట్టి ప్రభాకర్ రావు కవితతో ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన, జీవన్ రెడ్డిని 'అన్న' అని సంబోధిస్తూ ఆత్మీయతను చాటుకున్నారు. కరీంనగర్, మెట్‌పల్లి, చొప్పదండి వంటి నియోజకవర్గాల్లో జీవన్ రెడ్డి చేరిక వల్ల భారీ ప్రభావం ఉంటుందని సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా చేయించుకున్న సర్వేల్లోనూ బీఆర్ఎస్ పుంజుకుంటోందని తేలిందని పరోక్షంగా చురకలంటించారు. మరోవైపు జీవన్ రెడ్డి కూడా రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. నలభై ఏళ్ల పాటు కాంగ్రెస్ జెండాను మోసిన తనకు, ప్రస్తుత ప్రభుత్వంలో అవమానాలు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పీడ రాష్ట్రానికి వదిలిపోవాలని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడమే తెలంగాణకు క్షేమకరమని ఆయన జోస్యం చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 10 శాతం సీట్లు కూడా రావని ధీమా వ్యక్తం చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రచారం తప్పు అని, సాంకేతిక లోపాలను భూతద్దంలో చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. జగిత్యాల సభకు ముందు కేసీఆర్‌కు తృటిలో ప్రమాదం తప్పడం అందరినీ ఆందోళనకు గురిచేసింది. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండవుతుండగా ఒక డ్రోన్ అకస్మాత్తుగా ఎదురు రావడంతో పైలట్ అప్రమత్తమై పెద్ద ప్రమాదాన్ని నివారించారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. అయినప్పటికీ కేసీఆర్ ఏమాత్రం బెదరకుండా సభకు హాజరై తన గంభీర ప్రసంగంతో కార్యకర్తలలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సంఘటన గులాబీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది, భద్రతా వైఫల్యాలపై పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సభ ప్రారంభానికి ముందు తెలంగాణ కళాకారుల ఆటాపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ గాయని మధుప్రియ, మాట్ల తిరుపతి తదితరులు తమ గళంతో సభను ఉత్తేజపరిచారు. "సారే రావాలి.. సారే కావాలి" అనే నినాదాలతో జగిత్యాల పురవీధులు మారుమోగాయి. వేలాదిగా తరలివచ్చిన జనసందోహం కళాకారుల పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ పండుగ వాతావరణాన్ని తలపించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ ప్రదర్శనలు సాగాయి, ఇది సభకు వచ్చిన వారిలో భావోద్వేగాన్ని నింపింది. మొత్తానికి జగిత్యాల బహిరంగ సభ రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా నిలిచింది. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఆయుధంగా మలుచుకోవడంలో కేసీఆర్ విజయవంతమయ్యారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సభతో బీఆర్ఎస్ మళ్లీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా అడుగులు వేస్తోంది. అధికార పక్షం వైఫల్యాలను కేసీఆర్ తనదైన శైలిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంతో రాబోయే రోజుల్లో రాజకీయ పోరు మరింత రసవత్తరంగా మారనుంది. జగిత్యాల వేదికగా మొదలైన ఈ జైత్రయాత్ర రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి మార్పులు తెస్తుందో వేచి చూడాలి.

## 20 నెలలు నా ఉసురు పోసుకున్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దశాబ్దాల కాలం పాటు ఒకే సిద్ధాంతానికి కట్టుబడి, కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలా నిలిచిన సీనియర్ నేత జీవన్ రెడ్డి తాజాగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. కేవలం పార్టీ మారడమే కాకుండా, ప్రస్తుత పాలనపై ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. రాష్ట్రంలోని ఏ పల్లెలో చూసినా ప్రస్తుతం వినిపిస్తున్న ఒకే ఒక్క నినాదం 'రేవంత్ రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావాలి' అని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో మారుతున్న ఈ గొంతుకలే రేపటి రాజకీయ భవిష్యత్తుకు దిక్సూచి అని ఆయన విశ్లేషించారు. రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియలో కేసీఆర్ నాయకత్వం అనివార్యమని జీవన్ రెడ్డి నొక్కి చెప్పారు. అభివృద్ధి అంటే కేవలం అంకెలు కాదని, అది ప్రజల కళ్లల్లో కనిపించే సంతృప్తి అని ఆయన అభిప్రాయపడ్డారు. జగిత్యాల పర్యటనకు కేసీఆర్ వస్తున్నారంటే చాలు, వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి గుమిగూడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సుమారు 119 నియోజకవర్గాల్లో నేడు కేసీఆర్ పట్ల ఉన్న ఆదరణ ఏమాత్రం తగ్గలేదని, పైగా గడిచిన కొద్ది నెలల పాలనను చూసిన ప్రజల్లో పశ్చాత్తాపం కనిపిస్తోందని ఆయన వివరించారు. ఈ జనసందోహమే కేసీఆర్ పట్ల ప్రజల్లో ఉన్న అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తనకు గులాబీ అధినేత కేసీఆర్‌తో ఉన్న అనుబంధం నిన్న మొన్నటిది కాదని, అది కొన్ని దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణమని జీవన్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ చూపిన తెగువను ఆయన ప్రస్తుత తరానికి వివరించారు. ముఖ్యంగా 2004 నుండి 2014 మధ్య జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ, ప్రత్యేక రాష్ట్ర కాంక్ష కోసం కేంద్ర మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకున్న నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. పదవుల కంటే ప్రాంత ప్రయోజనాలే ముఖ్యమని భావించిన అరుదైన రాజకీయ వేత్త ఆయనని, అటువంటి వ్యక్తితో కలిసి పనిచేయడం గర్వకారణమని జీవన్ రెడ్డి ఉద్ఘాటించారు. గతంలో జరిగిన కొన్ని రాజకీయ పరిణామాలను జీవన్ రెడ్డి ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. కరీంనగర్ ఎంపీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధిష్టానం తనను బలవంతంగా కేసీఆర్‌పై పోటీకి దించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లాంటి మహామేధావిని, ఉద్యమ వీరుడిని ఢీకొనే సామర్థ్యం ఈ రాష్ట్రంలో ఎవరికీ లేదన్నది అప్పట్లోనే స్పష్టమైందని ఆయన విశ్లేషించారు. నాటి ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు తెలంగాణ అస్థిత్వానికి వేసిన పునాది అని, నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ ఒక శక్తిగా ఎదిగారని ఆయన కొనియాడారు. ఆనాడు తనపై ఒత్తిడి తెచ్చిన కాంగ్రెస్ వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. గత 20 నెలలుగా తన రాజకీయ ఉనికిని దెబ్బతీస్తూ, తన ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి దెబ్బతీశారని ఆరోపించారు. ఒక రకంగా చెప్పాలంటే



రేవంత్ తన ఉసురు తీసుకున్నాడని ఆయన అత్యంత ఆవేదనతో వ్యాఖ్యానించారు. సీనియర్ నాయకులను గౌరవించడం మానేసి, వ్యక్తిగత కక్ష సాధింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని హెచ్చరించారు. తన లాంటి సీనియర్ నేతకు ఎదురైన ఈ చేదు అనుభవం పార్టీలోని ఇతర నేతలకు కూడా ఒక హెచ్చరిక లాంటిదని, ఇలాంటి పోకడలు భవిష్యత్తులో పార్టీని కోలుకోలేని దెబ్బ తీస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించానని, ఎన్నో ఆపద సమయాల్లో పార్టీని అండగా నిలబెట్టానని జీవన్ రెడ్డి తెలిపారు. అయితే జీవిత చరమాంకంలో తనకు దక్కింది కేవలం మానసిక వేదన, తీవ్ర అసంతృప్తి మాత్రమేనని ఆయన వాపోయారు. ఇన్నేళ్ల సేవకు దక్కిన ప్రతిఫలం ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. ఏనాడూ పదవుల కోసం పైరవీలు చేయలేదని, కేవలం ప్రజల పక్షాన నిలబడి పనిచేశానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తనను వాడుకుని వదిలేసిందన్న భావన ఇప్పుడు తనలో బలంగా నాటుకుపోయిందని, అందుకే మనస్తాపంతో ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. తెలంగాణకు పట్టిన శనిలా కాంగ్రెస్ పాలన తయారైందని, ఈ పీడ వదిలించుకోవాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని జీవన్ రెడ్డి ఆకాంక్షించారు. 2014 నుండి 2023 వరకు జరిగిన అభివృద్ధిని, ప్రస్తుత వైఫల్యాలను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో ప్రస్తుతం కనిపిస్తున్న జాప్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు వంటి విప్లవాత్మక పథకాలకు తూట్లు పొడుస్తున్నారని, దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. మళ్లీ తెలంగాణ గడ్డపై గులాబీ జెండా రెపరెపలాడటమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పల్లెలో కేసీఆర్ నామస్మరణ మారుమోగాలని, పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 12,700 పైచిలుకు గ్రామ పంచాయితీల్లో ప్రతి ఇంటి గడపకు కేసీఆర్ చేసిన మేలు చేరుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కని పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రజా వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో క్షేత్రస్థాయిలో పర్యటిస్తే తెలుస్తుందని, అధికార మదంతో కళ్లు మూసుకుపోయిన నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని ఆయన అభివర్ణించారు.

# కాళేశ్వరంపై క్లారిటీ ఇవ్వని కేసీఆర్

**మొదటిపేజీ తరువాయి**

ప్రాధాన్యత ఇవ్వడం కార్యకర్తలను సైతం నిరాశకు గురిచేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టుల వైఫల్యాలంటూ ప్రతిరోజూ విమర్శనాస్త్రాలు సంధిస్తుంటే జగిత్యాల గడ్డపై వాటి ఊసే ఎత్తకపోవడం గమనార్హం. ప్రస్తుత రాజకీయ క్షేత్రంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై సాగుతున్న రచ్చ అంతా ఇంతా కాదు. అధికార పక్షం ఈ అంశాన్ని ఒక శక్తివంతమైన మిస్సైల్‌లా వాడుతూ విరుచుకుపడుతుంటే దానికి గట్టి కౌంటర్ ఇస్తారని అంతా ఆశించారు. తీరా సభ ప్రారంభమయ్యాక కేసీఆర్ ప్రసంగం అస్సలు ఆ దిశగా సాగకపోవడంతో సభ చప్పగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రాష్ట్ర ప్రయోజనాలకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వివరణ ఇవ్వకుండా మౌనం వహించడం వల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న ఆందోళన సొంత పార్టీ నేతల్లోనే వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో సమస్యలపై పోరాడాల్సిన నాయకుడు కేవలం రక్షణ ధోరణిలోనే మాట్లాడటం ఆశ్చర్యం కలిగించింది. అధికారంలోకి రాగానే తొలి సంతకం హైడ్రా రద్దుపైనే పెడతానని చెప్పడం విజ్ఞులను విస్మయానికి గురిచేస్తోంది. నగర పరిధిలోని చెరువుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఒక వ్యవస్థను రాజకీయ కోణంలో విమర్శించడం వల్ల ప్రయోజనం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. అసలు ప్రజల సమస్యలకు సంబంధం లేని అంశాన్ని తెరపైకి తెచ్చి రద్దు చేస్తానని ప్రకటించడం ద్వారా గులాబీ అధినేత తన సహజసిద్ధమైన రాజకీయ చాతుర్యాన్ని కోల్పోతున్నారా అన్న అనుమానం కలుగుతోంది. ఒకప్పుడు ప్రజా నాడిని పట్టుకోవడంలో దిట్టగా పేరున్న నాయకుడు ఇప్పుడు అసంబద్ధమైన హామీలతో కాలక్షేపం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తన పదేళ్ల పాలనలో ఏం చేశారో వివరించడానికి ప్రసంగంలో సింహభాగం కేటాయించారు. గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, నిర్మించిన ప్రాజెక్టుల గురించి పదేపదే నెమరువేసుకోవడంతో కొత్తదనం లోపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు చేయడంలో కూడా ఆయన పాత శైలిని అనుసరించారు. ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న కరవు పరిస్థితులకు తాము అధికారంలో లేకపోవడమే కారణమని బాధపడే ప్రయత్నం చేశారు. ప్రజల కష్టాలను రాజకీయ కోణంలో చూడటం కంటే ప్రస్తుత





వైఫల్యాలను ఎండగట్టడంలో ఆయన సంయమనం కోల్పోయినట్లు కనిపిస్తోంది. పాత విషయాలకే పరిమితం కావడం వల్ల యువ ఓటర్లను ఆకట్టుకోవడం కష్టమనే అభిప్రాయం వినిపిస్తోంది. సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్‌లో ఉండి ఇప్పుడు గులాబీ తీర్థం పుచ్చుకున్న జీవన్ రెడ్డిని ఒక గొప్ప ధీశాలిగా చిత్రించడానికి కేసీఆర్ చాలా కష్టపడ్డారు. బీఆర్ఎస్ స్థాపించిన నాటి నుంచి జగిత్యాలలో ఆ పార్టీ తరపున ఒక్కసారి కూడా గెలవని నాయకుడిని ఆకాశానికెత్తుతూ చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయి. నిన్నటి వరకు ప్రత్యర్థిగా ఉన్న వ్యక్తిని ఇప్పుడు రథసారథిగా అభివర్ణించడం సొంత పార్టీ శ్రేణులకు మింగుడుపడటం లేదు. నియోజకవర్గంలో మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న నేతలకు ఈ పరిణామం తీరని ఇబ్బందిని కలిగిస్తోంది. ఒక వలస నాయకుడికి ఇచ్చిన ఎలివేషన్ భవిష్యత్తులో అంతర్గత కుమ్ములాటలకు దారితీసే అవకాశం లేకపోలేదు. సీనియర్ నేత కేకేకు గతంలో ఇచ్చిన సెక్రటరీ జనరల్ హోదా జీవన్ రెడ్డికి కూడా దక్కుతుందని ఆయన అనుచరులు ఆశించారు. తీరా చూస్తే రాష్ట్ర స్థాయి రాజకీయాలతో సంబంధం లేదని తేల్చేస్తూ కేవలం ప్రధాన కార్యదర్శి పదవికే పరిమితం చేయడం అవమానకరంగా ఉందన్న చర్చ మొదలైంది. జగిత్యాలతో పాటు పక్కన ఉన్న కొన్ని జిల్లాలను చూసుకోవాలని సూచించడం ద్వారా జీవన్ రెడ్డి స్థాయిని కేసీఆర్ తగ్గించి చూపినట్లయింది. ఒక జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న నాయకుడిని కేవలం ప్రాంతీయ బాధ్యతలకే పరిమితం చేయడం వెనుక అంతరార్థం ఏమిటో ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఇది జీవన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై పెద్ద దెబ్బగానే కనిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రత్యర్థులు తన మరణాన్ని కోరుకుంటున్నారని చెప్పడం కేసీఆర్‌కు పరిపాటిగా మారింది. ఈ సభలోనూ అదే పాత రికార్డును వినిపిస్తూ సెంటిమెంట్ పండించే ప్రయత్నం చేశారు. వెయ్యి జన్మలెత్తినా తాను పోనని, తనను ఎవరూ ఏమీ చేయలేరని చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఏ మేరకు మైలేజీని ఇస్తాయో వేచి చూడాలి. కాలం చెల్లిన ఇటువంటి భావోద్వేగపూరిత ప్రసంగాలు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రజలను ఏమాత్రం ప్రభావితం చేయలేవని మేధావులు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగత విమర్శలు, సెంటిమెంట్ మాటల కంటే ప్రజా సమస్యలపై పోరాడే ధీరత్వం ప్రదర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేశాయి. జన సమీకరణలో ఎక్కడా లోటు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. అధినేత వేదికపైకి వచ్చినప్పటి నుంచి 'సీఎం కేసీఆర్' అనే నినాదాలు మార్మోగేలా కార్యకర్తలను సన్నద్ధం చేశారు. అయితే ఇదే కార్యకర్తలు కేటీఆర్ పర్యటనకు వెళ్లినప్పుడు ఆయనే ముఖ్యమంత్రి అని నినదించడం విచిత్రంగా ఉంది. ఇటువంటి కృత్రిమ నినాదాలు రాజకీయంగా ఏమాత్రం ఫలితాలను ఇవ్వవు. ప్రజల ఆదరణ సహజంగా ఉండాలి తప్ప ఇలా బలవంతంగా అరిపించడం వల్ల నాయకుడి ఇమేజ్ పెరగదు సరికదా దిగజారుతుంది. పార్టీలో నాయకత్వ పరంగా ఉన్న స్పష్టత లేమిని ఈ నినాదాలు బయటపెడుతున్నాయి. ప్రసంగం అంటే ఒక ప్రమాణాన్ని సృష్టించిన కేసీఆర్ ఇప్పుడు ఆ స్థాయిని అందుకోవడంలో తడబడుతున్నారు. ఆవిర్భావ సభ మొదలుకొని తాజాగా జరిగిన జగిత్యాల సభ వరకు ప్రసంగాలలో వాడివేడి కనిపించడం లేదు. ప్రత్యర్థులపై విరుచుకుపడే క్రమంలో ఆయనలో పాత దూకుడు కరువైంది. కేవలం ఆత్మరక్షణలో ఉంటూ గతాన్ని నెమరువేసుకోవడమే ఒక బలహీనతగా మారుతోంది. సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకుని ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విశ్లేషణలు చేయలేకపోవడం పార్టీ భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది. రాజకీయ క్షేత్రంలో చురుకైన పాత్ర పోషించాల్సిన సమయంలో ఇలా మౌనంగా ఉండటం సరికాదు. జగిత్యాల సభ ద్వారా ఒక కొత్త ఉత్సాహాన్ని నింపాలని భావించినప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగానే కనిపిస్తోంది. నాయకుల చేరికలు కేవలం అంకెల పెంపునకే ఉపయోగపడతాయి తప్ప ప్రజాభిప్రాయాన్ని మార్చలేవు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి అంశాలపై కేసీఆర్ స్పందించకపోవడం పెద్ద లోపం. రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ పరిణామాలను గమనిస్తే కేవలం ప్రతిపక్షం హోదాను కాపాడుకోవడమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోంది. అధికార పక్షం విసురుతున్న సవాళ్లను స్వీకరించి ధీటుగా బదులివ్వడంలో ఆయన పూర్తిగా వైఫల్యం చెందారు. ఇది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మొత్తానికి జగిత్యాల సభ గులాబీ దళానికి ఒక గుణపాఠం లాంటిదని చెప్పవచ్చు. పాత పద్ధతులతో ప్రజలను మభ్యపెట్టడం సాధ్యం కాదని ఈ ఉదంతం నిరూపించింది. నాయకత్వ మార్పు అవసరమా లేక విధానాల మార్పు అవసరమా అన్నది పార్టీ లోతుగా ఆలోచించుకోవాలి. కేవలం వ్యక్తిగత ఆరోపణలు, పాత కథల వల్ల ప్రయోజనం లేదు. ప్రజా సమస్యలపై పోరాడే అసలైన ప్రతిపక్షంగా నిలబడాలంటే ప్రసంగాలలో గాంభీర్యం కాదు.. వాస్తవికత ఉండాలి. లేదంటే ఇలాంటి సభలు కేవలం కాలక్షేపానికే పరిమితమవుతాయి. జగిత్యాల గడ్డపై వినిపించిన ఆవేదన కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపలేకపోయిందన్నది అక్షర సత్యం.

# సమానత్వం, సత్యం, సేవకు ప్రతీక బసవేశ్వరుడు జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** బసవేశ్వరుడు కేవలం ఒక మతపరమైన గురువు కాదని, ఆయన గొప్ప సమాజ మార్గదర్శి అని, సమానత్వం, సేవ, నిజాయితీ వంటి విలువలను మన జీవన విధానంలో నిలబెట్టుకోవాలని బోధించారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. సోమవారం మహాత్మా బసవేశ్వర జయంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎం.ఏ. నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన నియోజకవర్గ నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, భారతదేశ చరిత్రలో బసవేశ్వరుడు గొప్ప సామాజిక సంస్కర్త, తత్వవేత్త, కవి అని కొనియాడారు. 12వ శతాబ్దంలో జీవించిన ఆయన సమాజంలో ఉన్న అన్యాయాలు, కుల వ్యవస్థ, అసమానతలపై పోరాడారని గుర్తుచేశారు. బసవేశ్వరుడి ఆశయాలను మన హృదయాల్లో నిలుపుకొని సమానత్వం, సేవ, సత్యం అనే మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నేపల్లి సాంబశివ రావు, రాంచందర్ గౌడ్, కృష్ణ, ప్రభాకర్ రెడ్డి, రవి కుమార్ గౌడ్, రాంబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్.. నువ్వో.. నేనో తేల్చుకుందాం

**మొదటిపేజీ తరువాయి**

సుస్థిరం చేసిన రైతులకు కృతజ్ఞతలు తెలుపుతూనే, ప్రతిపక్షాల విమర్శలకు తనదైన శైలిలో ఘాటుగా సమాధానమిచ్చారు. కాంగ్రెస్ అంటేనే ప్రాజెక్టుల నిర్మాణమని, రైతు సంక్షేమమని ఆయన పునరుద్ఘాటించారు. దేశంలోనే రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తు చేస్తూ, ఇప్పుడు కూడా అదే బాటలో రైతన్నకు భరోసా కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. రెండో విడత రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం ఈ సభలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి సగర్వంగా ప్రకటించారు. ఈ క్రమంలోనే సుమారు 5,700 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు వెల్లడించారు. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుతూ, వచ్చే నెలలో మరో 3,300 కోట్ల రూపాయలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రుణమాఫీ వంటి భారీ నిర్ణయాలను కేవలం ఏడాది కాలంలోనే అమలు చేసి చూపడం ద్వారా, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఆయన నిరూపించారు. కేవలం మాటలు చెప్పడం కాకుండా, చేతల్లో గణాంకాలను చూపిస్తూ ఆయన ప్రసంగించడం సభికులను ఆలోచింపజేసింది. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో గత పాలకుల వైఫల్యాలను, అహంకారాన్ని ఎండగట్టారు. గత ప్రభుత్వ హయాంలో పాలకులు ఫామ్‌హౌస్‌లకే పరిమిత



మయ్యారని, పేదల కష్టాలను గాలికొదిలేశారని విమర్శించారు. వాస్తు పేరుతో నిర్మితమైన సచివాలయాన్ని కూల్చడాన్ని ఆయన తప్పుబట్టారు. కుటుంబ సభ్యులందరూ తలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారే తప్ప, పేదవాడికి ఒక ఇల్లు కట్టించాలనే ఆలోచన చేయలేదని మండిపడ్డారు. పేదలకు పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు కట్టుకోవడానికి కూడా పనికిరాని స్థితిలో ఉండేవని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల దృష్టిలో పేదలు కేవలం దొరల గడీల ముందు ఊడిగం చేసేవారిగానే ఉండాలని ఆకాంక్షించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంకెళ్లను తెంచిందని వివరించారు. రుణమాఫీ పథకంపై ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి గణాంకాలను విడమర్చి చెప్పారు. దాదాపు 25.35 లక్షల మంది రైతులకు మేలు చేస్తూ 22 వేల కోట్ల రూపాయలను రుణమాఫీ కింద ఇప్పటికే పంపిణీ చేశామని తెలిపారు. ఇది చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో రైతుల ఖాతాల్లోకి నిధులు చేరడం గమనార్హం. గత విడత రైతు భరోసా కింద కేవలం 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయలను అన్నదాతలకు అందించామని గుర్తు చేశారు. సంఖ్యల పరంగా చూస్తే, గత పదేళ్లలో జరగని అభివృద్ధి మరియు సంక్షేమం కేవలం ఈ కొద్ది కాలంలోనే సాధ్యమైందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ఈ నిధుల పంపిణీ రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 3.5 కోట్ల మంది పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న అంశాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పేదవాడి కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేవలం ఓట్ల రాజకీయాలకు పరిమితం కాకుండా, ప్రజల కనీస అవసరాలను గుర్తించి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా పాలన అంటే కేవలం అధికారంలో ఉండటం కాదని, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమేనని అభిప్రాయపడ్డారు. పేదల కోసం చేపట్టిన ఇటువంటి వినూత్న పథకాలు ప్రభుత్వానికున్న మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మార్పును ప్రజలు స్వయంగా గమనిస్తున్నారని, అందుకే ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు.

ప్రతిపక్ష నేతల విమర్శలపై రేవంత్ రెడ్డి అత్యంత వాడివేడిగా స్పందించారు. "ప్రజా పాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలి" అని కోరుకుంటున్న వారెవరో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు అధికారాన్ని అనుభవించి, ఇప్పుడు పదవి లేకపోయేసరికి అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, ఈ ప్రభుత్వం లక్షలాది మంది కార్యకర్తల కృషితో ఏర్పడిందని గుర్తు చేశారు. ఫామ్‌హౌస్ సంస్కృతిని ప్రోత్సహించిన వారు ప్రజా క్షేత్రంలోకి వచ్చేందుకు భయపడుతున్నారని విమర్శించారు. నేరెళ్లలో ఎస్సీలపై జరిగిన దాడులను, ఇసుక మాఫియా ఆగడాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. పార్టీ ఫిరాయింపులు మరియు సీనియర్ నేతల వైఖరిపై కూడా ఆయన ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ఎందరినో నాయకులుగా తీర్చిదిద్దిందని, ఎన్నో పదవులను ఇచ్చి గౌరవించిందని చెప్పారు. పార్టీ బీ ఫామ్ ద్వారా రాజకీయంగా ఎదిగి, ఇప్పుడు పదవీ వ్యామోహంతో పార్టీని వీడుతున్న వారిని ప్రజలు క్షమించరని అన్నారు. ఒక వ్యక్తికి పదవి రాకపోతే ప్రభుత్వం కూలిపోతుందా అని ప్రశ్నించారు. కొన్ని దశాబ్దాల పాటు పార్టీ నుంచి అన్ని ప్రయోజనాలను పొంది, చివరకు శత్రువుల పంచన చేరడం నైతికత కాదని అభిప్రాయపడ్డారు. అంకితభావంతో పనిచేసే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, ఇటువంటి నేతల వల్ల పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రేవంత్ రెడ్డి వివరించారు. ఇప్పటివరకు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా నిరుద్యోగుల ఆశాదీపంగా ప్రభుత్వం నిలిచిందని చెప్పారు. గత ప్రభుత్వం కేవలం నోటిఫికేషన్లతో కాలయాపన చేస్తే, తమ ప్రభుత్వం నియామక ప్రక్రియను వేగవంతం చేసిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పన ద్వారా యువతలో భరోసా పెరిగిందని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఇంతటి సానుకూల మార్పు వస్తున్న తరుణంలో, మళ్లీ పాత దొరల పాలన కోరుకోవడం అవివేకమే అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి విషయంలో కూడా గత ప్రభుత్వం విఫలమైందని ముఖ్యమంత్రి విమర్శించారు. వేములవాడ రాజన్న క్షేత్రానికి ఏటా 100 కోట్ల రూపాయలు ఇస్తానని ప్రకటించిన కేసీఆర్, పదేళ్లలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. కేవలం మాటల గారడీతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప, క్షేత్రస్థాయిలో చేసిన అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అన్ని ప్రాంతాలను, అన్ని వర్గాలను సమానంగా చూస్తుందని, ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటుందని చెప్పారు. రాజన్న సాక్షిగా రాష్ట్రం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో తాము ముందుకు సాగుతున్నామని ఆయన పునరుద్ఘాటించారు. ప్రధానంగా కేసీఆర్ రాజకీయ భవిష్యత్తుపై రేవంత్ రెడ్డి సంచలన సవాల్ విసిరారు. వచ్చే 2029 ఎన్నికల్లో తన రాజకీయ సత్తా ఏంటో చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రతిపక్ష హోదాను కూడా పోగొట్టకపోతే తన పేరు మార్చుకుంటానని భీషణ ప్రతిజ్ఞ చేశారు. కార్యకర్తల సాక్షిగా విసిరిన ఈ సవాల్ తెలంగాణ రాజకీయాల్లో కాక రేపుతోంది. వచ్చే ఎన్నికల వరకు వేచి చూడాల్సిన అవసరం లేదని, ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఆర్టీసీ అయిపోయింది.. ఇక MMTS వంతు!

- భాగ్యనగరంలో ఎంఎంటిఎస్ ప్రయాణం ఫ్రీ చేసేలా ప్రభుత్వ ప్లాన్
- రైల్వే ఆదాయ లోటు రూ. 10 కోట్లు భరిస్తామని సీఎస్ లేఖ
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓట్ల కోసమే ఈ నిర్ణయమని విమర్శలు
- ఉచితాల వల్ల రద్దీ పెరిగి రైల్వే సేవలు దెబ్బతినే ఛాన్స్
- రేపు మెట్రోను కూడా ఉచితం చేస్తే మనుగడ కష్టమని హెచ్చరిక
- అభివృద్ధి పక్కన పెట్టి ఉచితాలతో అప్పుల పాలు చేస్తున్నారని ఆరోపణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఉచిత పథకాల హోరుతో సామాన్యులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే 'మహాలక్ష్మి' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన సర్కార్, ఇప్పుడు తన తదుపరి వ్యూహాన్ని హైదరాబాద్ నగరంపై కేంద్రీకరించింది. నగర ప్రజలకు ఎంఎంటిఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణం కల్పిస్తామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రతిపాదనలు వినడానికి ఇంపుగా ఉన్నప్పటికీ, దీని వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో పట్టు సాధించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలాంటి ప్రజాకర్షక పథకాలను పావులుగా వాడుకుంటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయం కేవలం ప్రజా రవాణాను ప్రోత్సహించడం కోసమేనా లేక ఓటు బ్యాంకు రాజకీయాల కోసమా అనే చర్చ ఇప్పుడు సర్వత్రా నడుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇటీవల దక్షిణ మధ్య రైల్వే అధికారులతో జరిపిన చర్చలు ఈ పథకం అమలుకు ప్రాథమిక పునాదులు వేశాయి. రైల్వే ఉన్నతాధికారులతో భేటీ అయిన సీఎస్, ఎంఎంటిఎస్ సర్వీసులను ఉచితం చేసే అంశంపై లిఖితపూర్వక ప్రతిపాదనలు పంపడం గమనార్హం. ప్రస్తుతం ఎంఎంటిఎస్ ద్వారా రైల్వే శాఖకు ఏడాదికి కేవలం రూ. 10 కోట్ల వరకు మాత్రమే ఆదాయం లభిస్తోందని, ఆ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు. అయితే ఉచిత ప్రయాణం వల్ల పెరిగే రద్దీని తట్టుకునే భారాన్ని మాత్రం రైల్వే శాఖకే వదిలేయడం గమనార్హం. జూన్ 2వ తేదీన తెలంగాణ అవతరణ దినోత్సవం కానుకగా ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ ఒక వ్యవస్థను ఉచితాల వైపు మళ్లించేటప్పుడు దాని మనుగడపై ప్రభుత్వం కనీస శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం చెబుతున్న కారణాల ప్రకారం నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టినా, రోడ్లు వెడల్పు చేసినా ట్రాఫిక్ కష్టాలు తీరడం లేదని, అందుకే ప్రజలను రైలు మార్గాల వైపు మళ్లించాలని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ వాస్తవ పరిస్థితులు గమనిస్తే, ప్రభుత్వ ఉద్దేశం ట్రాఫిక్ నియంత్రణ కంటే కూడా రాజకీయ ప్రయోజనాలే అని అర్థమవుతోంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయకుండా, ఉన్న సౌకర్యాలను ఉచితంగా పంచడం వల్ల కలిగే ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. బస్సుల్లో మహిళలకు ఉచితం చేసినప్పుడు కలిగిన రద్దీ సమస్యలు, సామాన్య ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు ఇప్పుడు ఎంఎంటిఎస్ రైళ్లలో కూడా పునరావృతం అయ్యే అవకాశం ఉంది. నిజానికి ఈ ఉచిత పథకాల వెనుక ఉన్న ప్రధాన ఎజెండా త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. నగర పరిధిలో కాంగ్రెస్ పార్టీకి సరైన బలం లేకపోవడం, గత ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఇప్పుడు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం ఈ ఎత్తుగడ వేసింది. పదేళ్ల కాలంలో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గత ప్రభుత్వాల కంటే మిన్నగా ఏదో చేస్తున్నామని నిరూపించుకోవడానికి ఇదొక సులువైన మార్గంగా ప్రభుత్వం ఎంచుకుంది. కానీ ఉచితాల వల్ల రాష్ట్ర ఖజానాపై పడే భారం, తద్వారా ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం ఎన్నికల లబ్ధి కోసం దీర్ఘకాలిక ప్రయోజనాలను పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం ఆలోచించాలి. ఎంఎంటిఎస్ ఉచితం అనే ప్రతిపాదన రావడంతోనే ప్రజల్లో మరో పెద్ద సందేహం మొదలైంది. హైదరాబాద్ మెట్రో రైలు కూడా త్వరలోనే ప్రభుత్వం చేతుల్లోకి రాబోతున్న తరుణంలో, అక్కడ కూడా అందరికీ ఉచిత ప్రయాణం కల్పిస్తారా? అన్న చర్చ మొదలైంది. మెట్రో రైలు అనేది అత్యంత ఖరీదైన రవాణా వ్యవస్థ. దాని నిర్వహణ ఖర్చులు వేల కోట్లలో ఉంటాయి. ఎంఎంటిఎస్ మాదిరిగా తక్కువ ఆదాయం వచ్చే వ్యవస్థ కాదిది. ఒకవేళ రాజకీయ లబ్ధి కోసం మెట్రోను కూడా ఉచితాల జాబితాలో చేరిస్తే, ఆ ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇప్పటికే ఆర్టీసీ ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతుండగా, ఇప్పుడు రైల్వే, మెట్రోలను కూడా అదే బాట పట్టించడం అంటే అభివృద్ధిని వెనక్కి నెట్టడమే అవుతుంది. ప్రభుత్వ ఆలోచనా విధానం ఇలాగే ఉంటే భవిష్యత్తులో విమాన ప్రయాణాలు కూడా ఉచితం చేయాలని డిమాండ్లు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. సామాన్యులకు అన్నీ ఉచితంగా ఇవ్వాలనే తపన మంచిదే అయినప్పటికీ, అది వ్యవస్థలను నిర్వీర్యం చేయకూడదు. డొమెస్టిక్ మరియు ఇంటర్నేషనల్ విమానాలలో కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తే ప్రజలు ఇంకా సంతోషిస్తారు కదా అని నెటిజన్లు ఎగతాళిగా మాట్లాడుకుంటున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సంక్షేమ పథకాలు అవసరమే కానీ, అవి ప్రజలను సోమరిపోతులుగా మార్చేవిగా లేదా ప్రభుత్వ రంగాన్ని దివాలా తీయించేవిగా ఉండకూడదు. రేవంత్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు కేవలం తాత్కాలికంగా మెరిసే వెలుగులే తప్ప, రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శకాలు కావు. తెలంగాణ అవతరణ దినోత్సవం నాటికి ఈ పథకం అమలులోకి వస్తే, ఆ తర్వాత ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. రైల్వే బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించినా, పెరిగే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బోగీలను పెంచడం, భద్రతా ప్రమాణాలు పాటించడం వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. రైల్వే శాఖకు పది కోట్లు చెల్లించడం వల్ల సమస్య తీరదు. కోట్లాది రూపాయల పన్నులు చెల్లించే పౌరులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సింది పోయి, కేవలం ఉచితాలతో కాలక్షేపం చేయడం ప్రభుత్వ అసమర్థతను సూచిస్తుంది. ఇప్పటికే ఉన్న రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది, కొత్త ప్రాజెక్టులు ఆగిపోయాయి, ఇలాంటి సమయంలో ఉచితాల కోసం పాకులాడటం హాస్యాస్పదం. హైదరాబాద్ నగరం గ్లోబల్ సిటీగా ఎదగాలంటే మనకు కావాల్సింది సమర్థవంతమైన ప్రణాళికలు తప్ప ఉచిత తాయిలాలు కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానం వల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉంది. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే పెట్టుబడిదారులు ఇక్కడి ఉచితాల సంస్కృతిని చూసి వెనకడుగు వేయవచ్చు. ఒక నగరం అభివృద్ధి చెందాలంటే అక్కడి ప్రజలు తమ శ్రమకు తగ్గ ప్రతిఫలాన్ని ఆశించాలి తప్ప, ప్రభుత్వం ఇచ్చే ఉచితాల మీద ఆధారపడకూడదు. కానీ రేవంత్ ప్రభుత్వం ప్రజలను ఉచితాల ఊబిలోకి నెట్టి, వారి ఆత్మగౌరవాన్ని ఓట్ల రూపంలో కొనుగోలు చేయాలని చూస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి, రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యానికి ఏమాత్రం మేలు చేయదు.

# భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల మోత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువల సవరణకు ప్రభుత్వం కసరత్తును ముమ్మరం చేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న భారీ వ్యత్యాసాలను సరిదిద్దడంతో పాటు రాష్ట్ర ఖజానాకు అదనపు ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యంగా రెవెన్యూ యంత్రాంగం పావులు కదుపుతోంది. ముఖ్యంగా బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రికార్డు ధరలకు మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చేందుకు రిజిస్ట్రేషన్ల శాఖ సమగ్ర ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువలను సవరించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ ధరలు నామమాత్రంగానే ఉన్నాయి. ఒక ప్రాంతంలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం చదరపు గజం ధర కేవలం రూ.10 వేలుగా ఉంటే, బహిరంగ మార్కెట్‌లో అది రూ.లక్షకు పైగానే పలుకుతోంది. మరికొన్ని చోట్ల రూ.20 వేల ధర ఉన్న భూములు కోటి రూపాయల మార్కును దాటేశాయి. ఈ భారీ వ్యత్యాసం కారణంగా రిజిస్ట్రేషన్ల సమయంలో ప్రభుత్వం వందల కోట్ల రూపాయల రాబడిని కోల్పోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ధరలను పెంచాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ కీలక నిర్ణయం వెనుక ప్రముఖ ఆర్థికవేత్త, కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ సూచనలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చించారు. ఆర్థిక వనరులను మెరుగుపరుచుకోవడానికి రిజిస్ట్రేషన్ల విభాగాన్ని ప్రక్షాళన చేయాలని ఆయన సూచించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితర ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ భేటీలో ఆదాయ మార్గాల పెంపుపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించారు. ప్రస్తుతం రాష్ట్రానికి రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా నెలకు సగటున రూ.1,500 కోట్ల ఆదాయం లభిస్తోంది. ఏడాదికి ఇది రూ.18 వేల కోట్ల వరకు ఉంటుంది. తాజా సవరణల తర్వాత ఈ రాబడి ఏటా మరో రూ.3,600 కోట్లు పెరగవచ్చని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. అంటే నెలకు అదనంగా సుమారు రూ.300 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖాతాలో చేరనుంది. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరం చుట్టుపక్కల జరుగుతున్న భారీ లావాదేవీలే ఈ ఆదాయానికి ప్రధాన వనరుగా మారనున్నాయి. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ధరల పెంపు ప్రభావం ఎక్కువగా ఉండనుంది. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, కోకాపేట వంటి కమర్షియల్ హబ్‌లలో ధరల వ్యత్యాసం దాదాపు




80 శాతానికి పైగా ఉంది. ఇక్కడ ప్రభుత్వ రికార్డులు చూపిస్తున్న ధరలకు, విక్రయదారులు అడుగుతున్న ధరలకు పొంతనే లేదు. ఈ అస్తవ్యస్త విధానం వల్ల అటు ప్రభుత్వానికి నష్టం వాటిల్లడమే కాకుండా, పెద్ద ఎత్తున అవినీతికి ఆస్కారం ఏర్పడుతోందని అధికారులు గుర్తించారు. దీనిని అడ్డుకోవడానికి ధరల హేతుబద్ధీకరణ ఒక్కటే మార్గమని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం కేవలం ధరలను పెంచడమే కాకుండా, ప్రజలపై భారం తగ్గించేందుకు కొన్ని వెసులుబాట్లు కూడా కల్పించనుంది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం భూముల విలువ పెంచినప్పుడు రిజిస్ట్రేషన్ ఫీజులను తగ్గించడం ఆనవాయితీగా వస్తోంది. తెలంగాణలో కూడా అదే తరహాలో స్టాంప్ డ్యూటీని ఒక శాతం మేర తగ్గించే ఆలోచనలో యంత్రాంగం ఉంది. ఈ తగ్గింపు వల్ల కలిగే లోటును భూముల విలువల పెంపు ద్వారా భర్తీ చేసుకోవాలని యోచిస్తోంది. దీనివల్ల సామాన్యులకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది. మహిళల పేరిట ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసే వారికి ప్రత్యేక రాయితీలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మహిళా సాధికారతను ప్రోత్సహిస్తూ వారి పేరుతో చేసే రిజిస్ట్రేషన్లపై స్టాంప్ డ్యూటీని అదనంగా ఒక శాతం తగ్గించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఇప్పటికే రెసిడెన్షియల్ ఏరియాలు, ప్రధాన రహదారుల పక్కన ఉన్న కమర్షియల్ స్థలాలు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల విలువల సవరణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఈ కొత్త ధరలు అమల్లోకి వస్తే ఖాళీ స్థలాల విలువలు 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు వంటి భారీ ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. 2028 అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందే ఫ్యూచర్ సిటీలో ఆర్థిక కార్యకలాపాలు ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల వల్ల భూములకు డిమాండ్ గణనీయంగా పెరగనుంది. ఈ క్రమంలోనే భూముల ధరలను సవరించడం వల్ల అటు అభివృద్ధికి, ఇటు ప్రభుత్వ ఆదాయానికి సమతుల్యత ఏర్పడుతుందని సర్కారు బలంగా విశ్వసిస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021 జూలైలో చివరిసారిగా రిజిస్ట్రేషన్ ఛార్జీలను సవరించారు. అప్పట్లో ఆరు శాతంగా ఉన్న ఛార్జీలను 7.5 శాతానికి పెంచారు. వ్యవసాయ భూముల కనీస విలువను ఎకరాకు రూ.75 వేలుగా నిర్ణయించారు. అలాగే లేఅవుట్ ప్లాట్ల ధరను గజానికి రూ.200కు, అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగు కనీస విలువను రూ.1,000కు పెంచారు. అప్పట్లో స్లాబుల వారీగా 20 నుంచి 50 శాతం వరకు పెంపుదల కనిపించింది. ఇప్పుడు మరోసారి అదే స్థాయిలో పెంపు ఉంటుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న రిజిస్ట్రేషన్ ఛార్జీల నిర్మాణాన్ని గమనిస్తే స్టాంపు డ్యూటీ 4 శాతంగా ఉండగా, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 1.5 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5 శాతంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో భూముల విలువలను సవరించిన తర్వాత, తెలంగాణ ఏర్పడ్డాక 2021 వరకు ధరలను మార్చలేదు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్థిక వనరులను పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని, అందుకే ఈ కఠినమైన నిర్ణయం తప్పడం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. దీనిపై త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. మొత్తానికి తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి ఈ నిర్ణయం ఒక కీలక మలుపు కానుంది. పెరిగిన ధరల వల్ల మధ్యతరగతి ప్రజలకు ఇల్లు కొనడం భారంగా మారినా, ప్రభుత్వానికి మాత్రం సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన నిధులు సమకూరనున్నాయి. నకిలీ లావాదేవీలు తగ్గుముఖం పట్టి, పారదర్శకత పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భూముల ధరల పెంపు వల్ల రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయ లక్ష్యాలను సులభంగా చేరుకునే అవకాశం కనిపిస్తోంది.



# నేతల 'బూతుల' రాజకీయం!

**మొదటిపేజీ తరువాయి**

విమర్శించే క్రమంలో ఆయన సంయమనం కోల్పోయారు. కేసీఆర్ లాంటి వారిని ద్రోహులుగా, కర్కోటకులుగా సంబోధిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అదుపు తప్పి మాట్లాడటం వల్ల వ్యవస్థల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం సడలిపోయే ప్రమాదం ఉంది. రేవంత్ రెడ్డి, కేసీఆర్ ఇద్దరూ రాష్ట్ర రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ నాయకులు. అటువంటి నేతలు ప్రజా వేదికలపై ఒకరినొకరు దూషించుకోవడం మూర్ఖత్వానికి పరాకాష్ట అని ప్రజలు చర్చించుకుంటున్నారు. వ్యక్తిగత కోపతాపాలు ఉంటే వాటిని వ్యక్తిగతంగానే తేల్చుకోవాలి తప్ప, జనాన్ని ప్రభావితం చేసేలా వేదికలపై ప్రదర్శించడం సరికాదు. రాజకీయం అంటే విధానాల పరంగా వైరుధ్యాలను ప్రదర్శించాలి తప్ప, వ్యక్తిగత కక్షలకు వేదికలుగా మార్చకూడదు. నేతల తీరు వల్ల యువతకు తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. ప్రజాప్రతినిధులు తమ హుందాతనాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రత్యర్థులు ఏవైనా తప్పులు చేస్తే వాటిని ఆధారాలతో సహా ఎండగట్టాలి. అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, న్యాయస్థానాల ద్వారా శిక్ష పడేలా చూడాలి. అంతేకాని బహిరంగంగా బూతులు తిట్టుకోవడం, వ్యక్తిగత దూషణలకు దిగడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. ఇలాంటి రాజకీయాల కోసం ప్రజలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదు. ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే నాయకులు తమ భాషను, ప్రవర్తనను మార్చుకోవాల్సిందే. తెలంగాణ సమాజం చైతన్యవంతమైనది. ఇక్కడ ప్రజలు నాయకుల ప్రతి కదలికను గమనిస్తుంటారు. కేవలం భావోద్వేగాలను రెచ్చగొట్టి ఓట్లు పొందాలని చూస్తే అది తాత్కాలికమే అవుతుంది. దీర్ఘకాలంలో ప్రజల మెప్పు పొందాలంటే అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడం, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం తక్షణ అవసరం. నాయకులు తమ మధ్య ఉన్న రాజకీయ పోరాటాన్ని సిద్ధాంతాల పరంగా కొనసాగిస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. రాజకీయ ప్రసంగాలు వినేందుకు వచ్చే ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తుంటారు. నిరుద్యోగం, వ్యవసాయ కష్టాలు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులపై నాయకులు చర్చించాలి. దాన్ని విడిచిపెట్టి పరస్పర దూషణలకు ప్రాధాన్యత ఇస్తుండటంతో విలువలు పతనం అవుతున్నాయి. తెలంగాణ తెచ్చుకున్నది మన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి, మన వనరులను మనం సద్వినియోగం చేసుకోవడానికి. ఆ లక్ష్యం నీరుగారిపోకుండా చూడాల్సిన బాధ్యత నేటి తరానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులపై ఉంది. చివరగా చెప్పాలంటే, తెలంగాణ రాష్ట్రం ఒక మహోన్నత ఆశయానికి రూపం. రాజకీయ నాయకులు తమ భాషలో సంస్కారాన్ని ప్రదర్శించాలి. అధికార గర్వంతోనో, ప్రతిపక్షంలో ఉన్నామనే ఆవేదనతోనో సంయమనం కోల్పోకూడదు. భవిష్యత్తు తరాలకు మనం ఎలాంటి రాజకీయాన్ని అందిస్తున్నామో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. వ్యక్తిగత దూషణలు మాని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసేలా నాయకులు తమ వ్యవహారశైలిని మార్చుకోవాలి. అప్పుడే అమరవీరుల త్యాగాలకు సార్థకత లభిస్తుంది, సామాన్య పౌరుడికి ఆశించిన తెలంగాణ దక్కుతుంది.



# ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఆలస్యం ఉండదు

- **తెలంగాణ వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్**
- **ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేయడానికి ప్రభుత్వం సహకారం**
- **రామగుండంలో యూరియా ఉత్పత్తి, సరఫరాపై సమీక్ష ఫీల్డ్ స్థాయిలో పరిశీలన**



**విశాలభారతి, గోదావరిఖని:** రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్ సూచించారు.సోమవారం రామగుండంలోని ఆర్ఎఫ్‌సీఎల్ (RFCL) ప్లాంట్ లో తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి యూరియా ఉత్పత్తి, సరఫరాపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, తెలంగాణకు యూరియా ప్రధాన సరఫరాదారుగా ఉన్న ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నుండి ఖరీఫ్ సీజన్‌లో ఎలాంటి ఆలస్యం లేకుండా ఎరువులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రైతులకు సమయానికి ఎరువులు అందడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి, నిల్వలు, సరఫరాలో సమన్వయం పాటించాలని సూచించారు. రైతుల ప్రయోజనాల కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎరువుల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ తో కలిసి ప్లాంట్‌ను సందర్శించి, యూరియా ఉత్పత్తి ప్రక్రియను ఫీల్డ్ స్థాయిలో పరిశీలించారు. ఉత్పత్తి సామర్థ్యం, యంత్రాల పనితీరు, నిల్వలు వంటి అంశాలను పరిశీలించి అధికారులతో చర్చించారు.ఈ సమీక్ష సమావేశంలో ప్లాంట్ యూనిట్ హెడ్ జిందాల్, ప్రొడక్షన్ హెడ్ సహా, టెక్నికల్ సర్వీసెస్ హెడ్ డి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఆర్ బ్రదర్స్ వారి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




**అడవిదేవులపల్లి, విశాలభారతి:** అడవిదేవులపల్లి మండల కేంద్రంలో వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సూచన మేరకు అడవిదేవులపల్లి బస్టాండ్ సెంటర్ నందు సోమవారం చలివేంద్రాన్ని మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ తో కలిసి మండల కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు, బిఎల్ఆర్ బ్రదర్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ కేంద్రాన్ని బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎండలు మండుతున్న వేళ బాటసారిలకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మరియు కార్యకర్తలు, పెద్దింటి వెంకటేశ్వర్లు, వీరబోయిన వెంకటేశ్వర్లు, అన్నబోయిన మల్లికార్జున్, పేర్ల నాగరాజు, దుండిగాళ్ళ నాగరాజు, పసుపులేటి అజయ్, లాలూ నాయక్, పేర్ల రామాంజనేయులు, మరియు,బి ఎల్ ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గాలి వారి గూడెం గ్రామ కార్యదర్శికి ఘన వీడ్కోలు



**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మండలంలోని గాలి వారి గూడెం గ్రామంలో గ్రామ కార్యదర్శికి సర్పంచ్ కవిత ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి కార్యదర్శి చేసిన సేవలను కొనియాడారు.గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలో ఆయన చూపిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. గ్రామ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేసినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.అనంతరం కార్యదర్శికి శాలువాతో సన్మానం చేసి, స్మారక చిహ్నం అందజేశారు.గ్రామస్థులు కూడా ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి మాట్లాడుతూ, గాలి వారి గూడెం ప్రజల సహకారం వల్లే తాను తన విధులను సక్రమంగా నిర్వహించగలిగానని, అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలోసర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి,ఉప సర్పంచ్ బల్లెం ఎల్లయ్య, వార్డ్ సభ్యులు యెడెల్లి వెంకన్న,గ్రామ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు, మహిళా సంఘ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడలో భాగంగా సామూహిక శ్రీమంతాలు




**మోటకొండూర్, విశాలభారతి:** మోటకొండూర్ మండలంలో తేర్యాల గ్రామంలో సోమవారం పోషణ పక్వాడ(9 నుండి 23 వరకు)సామూహిక శ్రీమంతాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీడీపీఓ స్వరాజ్యం రేకల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిడ్డ ఎదుగుదలకు పోషకాహారం ప్రముఖ పాత్ర వహిస్తుందని, ముఖ్యంగా మొదటి 1000 రోజులు బిడ్డ మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమైన "బంగారు రోజులు" అని వివరిస్తూ. గర్భిణీ స్త్రీలు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తూ. ప్రతి గర్భిణీ ఆసుపత్రిలోనే ప్రసవం జరగేలా చూసుకోవాలని, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రసవం అనంతరం ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని, ఆరు నెలల వరకు తల్లి పాలను మాత్రమే ఇవ్వాలన్నారు. ఆరు నెలలు పూర్తయ్యిన వెంటనే అనుబంధ పోషకాహారం ప్రారంభించి, రెండు సంవత్సరాల వరకు తల్లి పాలను కొనసాగించడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుందని తెలుపుతూ. బిడ్డ ఆరోగ్యానికి, ఎదుగుదలకు ఇది ఎంతో మేలు చేసుత్నదానారు. అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి లత, ఉప సర్పంచ్ బాజా మోహన్, సెక్టార్ సూపర్వైజర్ జ్యోతి, అండాలు, అంగన్వాడీ టీచర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన దేవయ్య

- **పుల్లూరు దేవయ్య ప్రథమ వర్ధంతి సభలో**
- **సిపిఐ (ఎం ( జిల్లా కార్యవర్గ సభ్యులు అలవాల వీరయ్య**

**మరిపెడ, విశాలభారతి:** పేదల హృదయాల్లో నిలిచేది కమ్యూనిస్టులే అని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య అన్నారు. తాళ్ళ ఊకల్ గ్రామానికి చెందిన కామ్రేడ్ పుల్లూరు దేవయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా గ్రామంలో స్థూపావిష్కరణ నిర్వహించారు. దేవయ్య ప్రజల కోసం చివరి వరకు పోరాడిన నాయకుడని, ఆయన ఆశయాలను కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పేదల అభ్యున్నతికి, ఉపాధి హామీ, పెన్షన్లు, కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడిన ఆయన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో కందనూరి కవిత, గుండగాని మధుసూదన్, జిన్న లచ్చన్న, ఇతర నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు




## బాలయేసు పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

**ఎమ్మార్సి సిబ్బంది**




**దేవరుప్పుల విశాలభారతి:** మండలకేంద్రంలోని బాలయేసు ప్రవేట్ పాఠశాల ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.మండల విద్యాశాఖ అధికారి జి కళావతి,ఎమ్మార్సీ సిబ్బంది బుర్ర యాకస్వామి పై బాలయేసు పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు దాడి చేయడం తీవ్రంగా ఖండించారు. సోమవారం ఎమ్మార్సీ సిబ్బంది విధి నిర్వహణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలయేసు పాఠశాల యాజమాన్యం విధి నిర్వహణలో భాగంగా పాఠశాలను సందర్శించిన దుర్భాషలాడడం, పరుష పదజాలాలతో దూషించడం పరిపాటిగా మారిందని,చాలాసార్లు ఉన్నదా అధికారుల దృష్టికి సైతం తీసుకువెళ్లామని,ఎప్పటికప్పుడు రిపోర్టులు ఇవ్వకపోగా ప్రతిసారి దూషిస్తున్న జేసురాజుపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని,పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని,గత కొంతకాలంగా ప్రభుత్వ సెలవు దినాల్లో పాఠశాలలు నడపకూడదని మండల విద్యాశాఖ అధికారిని హెచ్చరించిన నోటీసు జారీ చేసినను పెడచెవిన పెడుతూ సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిసి ఆదివారం రోజు విద్యాశాఖ అధికారిని తనిఖీకి వెళ్ళగా ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతూ అధికారుల ఫోన్లను బలవంతంగా లాక్కొని పాఠశాల నుండి వెళ్ళగొట్టడం జరిగిందని,దీనిపై అధికారులు స్పందిస్తూ పాఠశాల గుర్తింపును రద్దుచేసి ప్రైవేట్ పాఠశాలల నియంతృత్వ ధోరణి నియంత్రించాలని,పాఠశాలలో విద్యార్థులను మానసికంగా హింసిస్తున్న యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిబ్బంది గోలి రవీందర్ రెడ్డి, మార్గం నరసింహులు, గుగులోత్ రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన చట్టాలపై శిక్షణ కార్యక్రమం

**జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దేశీరాం**



**మహబూబాబాద్,విశాలభారతి:** ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఐ టి డి ఏ ), ఏటూరునాగారం ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో గిరిజన చట్టాలపై గిరిజన సంస్థలు మరియు సంబంధిత అధికారులకు అవగాహన కల్పించుటకు సమావేశంతోడు శిక్షణ కార్యక్రమం ను ఏప్రిల్ 25న ఉదయం 11.00 గంటలకు ములుగు కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించబడునని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దేశీరాం నేడు ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాంతాలలో అమలులో ఉన్న ముఖ్యమైన చట్టాలు మరియు ప్రభుత్వ ఆదేశాలపై ఈ కార్యక్రమంలో వివరమైన అవగాహన ఈ సమావేశంలో కల్పించబడునని ముఖ్యంగా, అటవీ వాక్కుల గుర్తింపు చట్టం (ఆర్వో ఎఫ్ హెచ్) షా చట్టం (పి ఈ ఎస్ ఏ) భూసంపద బదిలీ నియంత్రణ చట్టం (ఎల్.టి.ఆర్) ఇతర ఏజెన్సీ చట్టాలు మరియు ప్రభుత్వ ఆదేశాలు గిరిజన సంస్థల నుండి వచ్చిన వినతుల ప్రకారం, ఈ చట్టాల అమలులో ఉన్న సమస్యలను పరిష్కరించుటకు ఈ సమావేశం నిర్వహించబడుచున్నదని ఈ కార్యక్రమానికి హైదరాబాద్లోని టి సి ఆర్ & II సంస్థ నుండి నిపుణులు (రిసోర్స్ పర్సన్లు) హాజరై. మార్గదర్శకాలు అందించనున్నారన్నారు. కాబట్టి సంబంధిత అధికారులు తహసీల్దార్లు అటవీ రేంజ్ అధికారులు సర్కిల్ ఇన్స్పెక్టర్లు (పోలీసు) జిల్లా మరియు మండల స్థాయి గిరిజన సంక్షేమ అధికారులు తమ తమ సంబంధిత సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా విభాగాల మధ్య సమన్వయం పెంపొందించడంతో పాటు గిరిజన సంక్షేమ చట్టాల సమర్థవంతమైన అమలు సాదించుట లక్ష్యంగా పెట్టుకున్నదని అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రంలను ప్రారంభించిన మార్కెట్ చైర్మన్

- **రైతులకు న్యాయమైన ధరల కోసం ఐకెపి కేంద్రాల ఏర్పాటు**
- **మధ్యవర్తుల దోపిడీకి అడ్డుకట్ట వేయడమే లక్ష్యం**
- **మహబూబాబాద్ జిల్లా మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్.**



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కొరవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి గ్రామస్థుల ప్రశంసలను అందుకుంది. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ మాట్లాడుతూ రైతు బాగుంటే దేశం బాగుంటుందని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యానికి న్యాయమైన ధర దక్కేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఐకెపి కొనుగోలు కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మధ్యవర్తుల దోపిడీకి అడ్డుకట్ట వేసి రైతులకు నేరుగా లాభం చేకూర్చే విధంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు. అలాగే రైతులు తమ పంటను ఎటువంటి ఇబ్బందులు లేకుండా విక్రయించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రైతుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన సేవా దృక్పథం, ప్రజల పట్ల చూపుతున్న అంకితభావం గ్రామ ప్రజలలో విశేష ఆదరణ పొందుతోంది. మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, కొరవి మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం, మాజీ కొరవి గుడి చైర్మన్ రాము నాయక్, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, గార్లపాటి వెంకటరెడ్డి లు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పని చేస్తోందని తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా లాభం చేకూరుతుందని, మధ్యవర్తుల వల్ల కలిగే నష్టాలను పూర్తిగా తగ్గించే దిశగా ఇది కీలక చర్యగా పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని నమ్మకంగా కేంద్రాలకు తీసుకురావాలని, అందుబాటులో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు, కొరవి మండలం ఎంపీడీవో, ఎమ్మార్వో, ఆర్ ఐ లైన్ డిపార్ట్మెంట్ సీఏ వడ్లకొండ శరత్ పాల్గొన్నారు. అలాగే మోదులగూడెం ఉప సర్పంచ్ దయ్యాల శ్రీధర్, అయ్యగారిపల్లి గ్రామ కార్యదర్శి అనిత, గ్రామ సర్పంచ్ జక్కుల మాధవి నాగన్న, ఉప సర్పంచ్ జిన్నా ప్రవీణ్ జ్యోత్స్న, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంగల జనార్దన్ రెడ్డి, వార్డ్ మెంబర్ దేశముఖ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కడారి రమణయ్య, మల్సూర్, కాకి వీరన్న, వడ్లకొండ కొమురయ్య, కందిపాటి సురేష్, జిన్ను నరేష్, నూకల మల్లేష్, బుర్ర బిక్షపతి, బుర్ర ఐలయ్యతో పాటు మహిళలు రమణ, మంగమ్మ, కోటమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభంతో గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ కోసం కృషి చేస్తున్న మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆంజనేయ స్వామిని దర్శనం చేసుకున్న రామగుండం ఎమ్మెల్యే



**విశాలభారతి , రామగుండం:** రామగుండం పట్టణంలోని పవర్ హౌస్ గుట్టపై స్వయంభువుగా వెలిసిన శ్రీ ధనుర్ బాణా ఆంజనేయ స్వామి వారిని సోమవారం పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తన సతీమణి మనాలి ఠాకూర్ తో కలిసి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా దంపతులు ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, "మన ప్రాంతీయ పవర్ హౌస్ గుట్టపై స్వయంభువుగా వెలసిన ఆంజనేయ స్వామి ఆలయం ప్రజల భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. భక్తుల సౌకర్యార్థం అవసరమైన అభివృద్ధి పనులకు నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను" అని తెలిపారు.

## గర్భిణీలకు ఘనంగా నిర్వహించిన సీమంతం



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం,ధరావత్ తండాలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు సీమంతం కన్నుల పండుగగా జరిగింది.గ్రామ సర్పంచ్ ధరావత్ అనిత పాల్గొనగా గర్భిణీలకు పసుపుకుంకుమ, స్వీట్లు,పూలుపండ్లు ,చీరలు, గాజులతో సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధరావత రవీందర్ నాయక్,ANM జ్యోతి,అంగన్వాడీ టీచర్లు అరుణ,ఉపేంద్ర,ఉప సర్పంచ్ బానోత్ కప్లి,ఆశా కార్యకర్తలు విజయ,బుజ్జి,సోషల్ మీడియా కోఆర్డినేటర్ బికోజీ,హరి,తదితరులు పాల్గొన్నారు.

## దేవరుప్పులలో ఘణంగా గ్రాడ్యుయేషన్ డే



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం దేవరుప్పుల పరిధిలోని వాడికి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ముఖ్య అతిథిగా దేవరుప్పుల ఉపసర్పంచ్ నర్ర కోమలత సోమేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో ఫ్రీ స్కూల్ విద్యను సమర్థవంతంగా అందిస్తున్నారు. ముఖ్యంగా అంగన్వాడి కేంద్రాల్లో మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య బోధించబడుతుంది. ఈ విద్యా విధానంలో పిల్లల మానసిక వికాసం సృజనాత్మకత అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టబడుతోంది, లోపల మరియు బయట జరిగే వివిధ ఆటల ద్వారా పిల్లల కండరాల అభివృద్ధి చురుకుదనం పెంపొందిలా శిక్షన ఇస్తున్నారు. అదే సమయంలో అంగన్వాడీ కేంద్రాల్లో విద్యతోపాటు పౌష్టికాహారం కూడా అందించడం జరుగుతుంది, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, వారి బరువు ఎత్తును క్రమం తప్పకుండా కొలుస్తూ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఇలా అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి డి సతీష్‌రెడ్డి, ఐసిడిసి సూపర్వైజర్ సావిత్రి, వార్డు సభ్యులు సందీప్, ఏఎన్ఎం వసంత, ఆశాలు రెడ్డి రాజుల జ్యోతి, తోటకూరి పుష్ప, అంగన్వాడీ ఉపాధ్యాయులు ఇ.సులోచన రాణి, ఏ అంజమ్మ, ఆయాలు ఈ యాదమ్మ, వి భాగ్యమ్మ, ఆర్ లక్ష్మి, మరియు బాలింతలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా బసవేశ్వర జయంతి ఘనంగా నిర్వహణ



**మహబూబాబాద్, విశాలభారతి:** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలతో, జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ అనుమతితో విశ్వగురు శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతి (అక్షయ తృతీయ) సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ బసవేశ్వర గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వర లింగాయత సాంప్రదాయ స్థాపకుడని మరియు సమానత్వం న్యాయం భక్తికి బలమైన ప్రతిపాదకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, జిల్లా అధికారులు మరియు కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరాజుపల్లి గ్రామంలో ఊరంతా బడిబాట




**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామంలో గల మూడు పాఠశాలల ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు.గ్రామ సచివాలయం వద్ద సమావేశంలో మాట్లాడుతూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి సుచిత్ర ఆనంద్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడడానికి ఉపాధ్యాయులంతా కట్టుబడి ఉన్నామని, ఉచిత పౌష్టికాహారం,ఉచిత పుస్తకాలు నోట్ బుక్స్ రెండు జతల ఏకరూప దుస్తులు, విశాలమైన ఆటస్థలం కావలసినన్ని ఆటవస్తువులు నాణ్యమైన విద్యను అందిస్తున్నాము. నాణ్యమైన ఉచిత ఆంగ్ల విద్యను అందిస్తున్నాము అని తెలిపారు. నిష్ణాతులైన సుశిక్షితులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో భోదన జరుగుతుంది అనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఏ.మాధవి తెలిపారు. మరియు హరిజన కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాస్కుల అంజయ్య మాట్లాడుతూ "ప్రైవేటు బడి వద్దు ప్రభుత్వ బడి ముద్దు"! అని , ప్రైవేటు బడి మోజులో పడి డబ్బు వృధా చేసుకోకుండా అట్టి డబ్బును మీ పిల్లల భవిష్యత్తు సంక్షేమం కోసం ఫిక్షిడ్ డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. చివరగా గ్రామ సర్పంచ్ శ్రీమతి కొండా ఊర్మిళ మల్లారెడ్డి మాట్లాడుతూ మన ఊరి బడి నీ మనమే కాపాడుకోవాలి.మన ఊరు పిల్లలు మన ఊరిలోనే చదువాలనీ ప్రతి పేరెంట్ బాధ్యత గా తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి గ్రామ అభివృద్ధి కి తోడ్పడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూడు పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు, మూడు అంగన్వాడీ కేంద్రాల టీచర్లు చింతల శ్రీలత, కొమ్ము మంగ,గ్రామ వార్డు మెంబర్లు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో బసవేశ్వర జయంతి ఘనంగా నిర్వహణ



**జనగామ, విశాలభారతి:** జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జనగామ వారి ఆధ్వర్యంలో శ్రీ మహాత్మా బస్వేశ్వర గారి జయంతి సోమవారం ఐడిఓసి కాంప్లెక్స్ కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా బస్వేశ్వర గారి చిత్రపటానికి పూలమాలవేసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి లక్ష్మీ నరసింహ రావు, జిల్లా ఆఫీసర్ రవీందర్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య, గోపా వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కన్న పరశురాములు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాల్నే ఉమాపతి, జిల్లా గౌరవ సలహాదారులు కుర్రముల సిద్దయ్య, మండల సోషల్ మీడియా కన్వీనర్ ములుగురి సంతోష్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు ఆంజనేయులు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన యువజన కాంగ్రెస్

- మోడీ పాలనపై కన్నెర్ర
- యువజన కాంగ్రెస్ ఉప్పెన
- తెలంగాణపై తేజస్వి సూర్య వ్యాఖ్యల దుమారం
- ఇందిరా పార్క్ సాక్షిగా యువ గర్జన




**విశాలభారతి,అబ్దుల్లాపూర్మెట్ :** దేశాన్ని రక్షించడమే ధ్యేయంగా, కేంద్రంలోని బీజేపీ నిరంకుశ పోకడలను ఎండగట్టేందుకు తెలంగాణ యువజన కాంగ్రెస్ సమరశంఖం పూరించింది. "మోడీ జి కో హటావో దేశ్ కి బచావో" అన్న నినాదాలతో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ మార్మోగింది. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి నాయకత్వంలో వేలాదిగా తరలివచ్చిన శ్రేణులతో ఇందిరా పార్క్ పరిసరాలు జనసంద్రాన్ని తలపించాయి.

**తెలంగాణ సోనియమ్మ ఇచ్చిన వరం!**

ధర్నాను ఉద్దేశించి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బీజేపీ భిక్ష కాదని, అది కోట్లాది మంది ఆకాంక్షను గౌరవించి తల్లి సోనియా గాంధీ ప్రసాదించిన చల్లని చూపు అని స్పష్టం చేశారు. స్వరాష్ట్రం కోసం అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, దీనిపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ఆగ్రహం

డిలిమిటేషన్ బిల్లు చర్చ సందర్భంగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును భారత్‌పాక్ విభజనతో పోల్చడాన్ని యువజన కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది.తెలంగాణను పాకిస్థాన్‌తో పోల్చడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరచడమే. ఇది యావత్ తెలంగాణ సమాజానికి జరిగిన అవమానం. ఇలాంటి వికృత వ్యాఖ్యలు చేసిన తేజస్వి సూర్య తక్షణమే క్షమాపణ చెప్పాలి.

**అని శివ చరణ్ రెడ్డి డిమాండ్ చేశారు. వంగేది మోడీ తలే.. దేశం కాదు!**

బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై విరుచుకుపడుతూ, మోడీ తలవంచితే అది ఆయన వ్యక్తిగత ఓటమి మాత్రమే.. దేశం ఎన్నటికీ తలవంచదు అంటూ కార్యకర్తలు నినదించారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా, విభజన హామీలను తుంగలో తొక్కిన మోడీ సర్కార్‌కు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన వేలాది మంది యువజన కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి తో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలే భవిష్యత్‌కు బాటలు



**మోటకొండూర్, విశాలభారతి:** మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక, అంగన్వాడీ పాఠశాలలు సంయుక్తంగా "బడిబాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాయి. కార్యక్రమంలో ఉభయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రావు, సోమయ్య, ఎ ఎ పీ సీ చైర్మన్ భార్గవి, గ్రామ సర్పంచ్ నర్సమ్మ, ఉపసర్పంచ్ కృష్ణ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సమ్మ, ఉపసర్పంచ్ కృష్ణ, ఎ ఎ పీ సీ చైర్మన్ భార్గవి మాట్లాడుతూ గ్రామంలోని పిల్లలను ప్రైవేట్ పాఠశాలలు లేదా హాస్టళ్లకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డిజిటల్ తరగతుల నిర్వహణ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత మధ్యాహ్న భోజనం, గుడ్లు, రాగి జావ, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూలు వంటి సదుపాయాలు విద్యార్థులకు అందుతున్నాయని తెలిపారు. గ్రామంలోని ప్రతి బాలబాలిక ప్రభుత్వ పాఠశాలలో చేరి విద్యాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.

## పురుషోత్తగూడెంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- ప్రభుత్వ మద్దతు ధరకు నేరుగా ధాన్యం కొనుగోలు
- కాంగ్రెస్ పార్టీ యువనాయకులు నూకల అభినవ్ రెడ్డి



**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మండలంలోని పురుషోత్తగూడెం గ్రామపంచాయతీలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నివా నాయకులు నూకల అభినవ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంప్రదాయ పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి కేంద్రాన్ని ప్రారంభించారు.రైతుల సమక్షంలో ప్రారంభమైన ఈ కొనుగోలు కేంద్రం ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు నేరుగా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.రైతులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా తమ పంటను విక్రయించుకోవచ్చని, అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కొనుగోలు కేంద్రం ప్రారంభంతో రైతులకు ధాన్యం విక్రయం సులభతరం అవుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## అంగన్‌వాడీ ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మండలంలోని స్టేజి తండా గ్రామపంచాయతీ కుడియా తండా అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ప్రీస్కూల్ విద్యను పూర్తి చేసి ప్రాథమిక పాఠశాలకు అడుగుపెడుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు పాటలు, నృత్యాలతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేషన్ క్యాప్‌లను సర్పంచ్ జాటోతు హమ్మి చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. తల్లిదండ్రులు, వార్డు సభ్యులు, మదర్ కమిటీ సభ్యులు కార్యక్రమానికి హాజరై పిల్లల ప్రతిభను అభినందించారు. అంగన్‌వాడీ టీచర్లు కుమ్మరి కుంట్ల జ్యోతి, మాట్లాడుతూ, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక విద్యతో పాటు మంచి అలవాట్లు, నైపుణ్యాలు అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. ఈ గ్రాడ్యుయేషన్ డే చిన్నారుల జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అంగన్వాడీ టీచర్ కుమ్మరి కుంట్ల జ్యోతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు గండి శ్రీలత, బైరోజు పద్మ, గుగులోతు కవిత,వార్డు మెంబర్ శ్రీదేవి, తల్లులు వనిత, అచ్చమ్మ, అంగన్వాడి హెల్పర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వృద్ధుడి మృతి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వడదెబ్బతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... ఘటకేశ్వర్ మండలం ప్రతాప్ సింగారం గ్రామానికి చెందిన హరిజన్ చిన్న నర్సప్ప (66) గత ఏడు రోజులుగా కనిపించకుండా పోయాడు. మృతుడి కుమారుడు బోయకాడి ఆనంద్ తెలిపిన ప్రకారం, నర్సప్పకు కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోతుండేవాడు. గతంలో ఒకసారి తప్పిపోయినప్పుడు సరూర్‌నగర్ పోలీసులు అతన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. తాజాగా ఏప్రిల్ 19, 2026న మధ్యాహ్నం సుమారు 01:42 గంటల సమయంలో నాగోల్ పోలీసులు ఆనంద్‌కు సమాచారం అందించారు. సర్వే నంబర్ 424, ఇందుకూరి టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న అత్తాపూర్ వెంచర్ వద్ద ఓ వృద్ధుడి మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఆనంద్ అక్కడికి చేరుకుని చూడగా, మృతుడు తన తండ్రి నర్సప్పేనని నిర్ధారించుకున్నాడు. ఎండలు తీవ్రంగా ఉండటం, అలాగే మానసిక స్థితి సరిగా లేకపోవడంతో దారి తప్పి తిరుగుతూ ఎండ వేడికి తట్టుకోలేక వడదెబ్బకు గురై మరణించి ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎటువంటి అనుమానాలు లేవని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుమారుడు ఆనంద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.

## కాంగ్రెస్ ను మహిళలు ఎప్పటికీ క్షమించరు

**రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్ రెడ్డి**



**మొయినాబాద్, విశాలభారతి:** అతివల హక్కులను అడ్డుకున్న కాంగ్రెస్ ను తెలంగాణ రాష్ట్ర మహిళలు ఎప్పటికీ క్షమించరని భాజపా రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్ రెడ్డి అన్నారు. లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని పేర్కొంటూ శనివారం ఆయన మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరులో మాట్లాడుతూ లోక్ సభలో ఓడింది కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లు మాత్రమే కాదని, అది దేశంలోని మహిళల ఆశల ఓటమి అని పేర్కొన్నారు. నష్టమని తెలిసినా సీఎం రేవంత్ రెడ్డి రేవంత్ నటిస్తున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులు వీగిపోయాయని కాంగ్రెస్ సంబరపడుతోందని, దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని తెలిసి కూడా తెలియనట్టు నటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు వివరణ ఇవ్వాలని గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. బిల్లును కాంగ్రెస్ ఏడుసార్లు ఓడించిందని. ఇప్పుడు ప్రవేశపెట్టిన బిల్లు ప్రకారం కాకుండా 2026 జనగణన ప్రకారం పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులు తీసుకొస్తే దక్షిణాది రాష్ట్రాలకు, తెలంగాణకు అత్యధిక నష్టం జరుగుతుంది గోపాల్ రెడ్డి అన్నారు. ఎల్లుగా ఎదురుచూస్తున్న నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలకు బాటలు వేసే రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడం దురదృష్టకరమన్నారు. వాటిని అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చరిత్రక తప్పిదం చేశాయన్నారు. ఆ పార్టీలు మహిళా ద్రోగులుగా నిలిచిపోతాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు బిల్లును ఎందుకు వ్యతిరేకిస్తున్నాయో చెప్పలేకపోయాయి బిల్లు పెట్టకముందు దక్షిణాదికి అన్యాయం అన్నారు బిల్లు పెట్టిన తర్వాత ఎంపీ అసెంబ్లీ స్థానాలను పెంచుకునే కుట్రని ఆరోపించారు. అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంచుకోవడానికి అవకాశం ఇస్తున్నట్లు కేంద్రం స్పష్టంగా చెప్పిందని ప్రధాని పత్రికల్లో వ్యాసాల ద్వారా ప్రజలకు వివరించారని లోకసభలో అఖిలపక్ష సమావేశంలో చెప్పారని గుర్తు చేశారు. అందరి సహకారం ఉంటుందని బిల్లు ప్రవేశపెడితే కాంగ్రెస్ మిత్రపక్షాలు కుట్ర చేసి అడ్డుకున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ చరిత్రక తప్పిదం చేసిందని మరోసారి విమర్శించారు.

## జగిత్యాల సభకు కదం తొక్కిన కార్యకర్తలు



- రామ్ లాల్ నాయక్ ఆధ్వర్యంలో భారీ తరలింపు

**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన బలపాల గ్రామ బీఆర్ఎస్ నాయకులు అపార ఉత్సాహంతో తరలివెళ్లారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు పట్ల ఉన్న అభిమానంతో కార్యకర్తలు పెద్దఎత్తున ఈ సభకు చేరుకున్నారు. సుమారు రెండు వందల యాభై కిలోమీటర్ల దూరాన్ని అధిగమిస్తూ, తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కొనసాగాలనే సంకల్పంతో ఈ ప్రస్థానం సాగింది. ఈ మహా తరలింపులో బలపాల బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ముఖ్య పాత్ర పోషించడం విశేషం. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నాయకులు ఒకే వేదికపైకి వచ్చి తమ ఐక్యతను చాటుకోవడం సభకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. కార్యకర్తలలో ఉత్సాహాన్ని నింపుతూ, గ్రామాల వారీగా ప్రజలను సమీకరించి ఈ సభను విజయవంతం చేయడంలో వారు కీలకంగా వ్యవహరించారు. అలాగే, ఈ కార్యక్రమానికి లింగయ్య తండా బి మాజీ సర్పంచ్ శ్రీ గుగులోతు రామ్ లాల్ నాయక్ గారి నాయకత్వం ప్రత్యేకంగా నిలిచింది. ఆయన పిలుపుతో యువకులు, మహిళలు, వృద్ధులు సైతం పెద్దఎత్తున పాల్గొనడం గమనార్హం. గ్రామ ప్రజలను ఒకే దిశగా నడిపిస్తూ, కేసీఆర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీకరణ బీఆర్ఎస్ పార్టీ బలాన్ని మరోసారి స్పష్టంగా చాటిచెప్పింది. బలపాల గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు అందరూ కలసి "ప్రజా సంక్షేమమే లక్ష్యం – తెలంగాణ అభివృద్ధే మార్గం" అనే నినాదాలతో జగిత్యాల వైపు కదిలారు. ఈ సభ ద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షలు మరింత బలపడతాయని, కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. జగిత్యాల సభలో కేసీఆర్ ప్రసంగం రాష్ట్ర రాజకీయాలకు కొత్త దిశను నిర్దేశిస్తూ, ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ భారీ జనసంద్రం తెలంగాణ ప్రజల హృదయాల్లో కేసీఆర్ స్థానం ఎంత గొప్పదో మరోసారి రుజువు చేస్తోందని వారు పేర్కొన్నారు

## వివిధ కార్మిక సంఘాల నుండి ఐ ఎఫ్ టి యులో చేరిక




**తిరుమలగిరి. విశాలభారతి:** తిరుమలగిరి మున్సిపాల్టీ పరిధిలో వివిధ కార్మిక సంఘాల నుండి భారత కార్మిక సంఘాల సమాఖ్య లో చేరడం జరిగింది.ఎండి. జానీ బేగం అధ్యక్షతన భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ కే మదార్,ఉపాధ్యక్షులు కన్నంతరెడ్డి, భాస్కర్ రెడ్డి సమక్షంలో కార్మికులు చేరడం జరిగింది.ఈ చేరిక సందర్భంగా ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ కే మదార్,ఉపాధ్యక్షులు కన్నంతరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సోమవారం నాడు తిరుమలగిరి ప్రాంతం నుండి వివిధ కార్మిక సంఘాల నుండి 35మంది ఐఎఫ్టియు లో చేరడం అనేది ఈప్రాంత కార్మిక వర్గ పోరాటాలను బలోపేతం చేయడానికి దోహదపడుతుందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఐఎఫ్ టి యు సంఘటిత.అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం నిజాయితీగా నిరంతరం పనిచేస్తుందని అన్నారు. ప్రధానంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి జీవిత భద్రత లేకుండా పోయిందని,వారికి ఎలాంటి హక్కులు సైతం లేకుండా జీవితాలను వెళ్లదీస్తున్నారు.కావున అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు జీవిత భద్రతతో కూడిన హక్కులు,సదుపాయాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని అనేకసంవత్సరాలుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యదొరణితో వ్యవహరిస్తున్నాయని ఆయన అన్నారు.అనేక మంది కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న చట్టాలను,హక్కులను ప్రభుత్వాలు కాలరస్తున్నాయని అన్నారు.ఈకార్యక్రమంలో విశ్వనాథం,రావుల మల్లేశ్, వెంకటయ్య, నర్సమ్మ, మంగమ్మ, లక్ష్మీ, పద్మ, కుమారి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## సౌమ్య స్కిన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్



- చర్మ వ్యాధులు, హెయిర్ ఫాల్‌పై అవగాహన
- ఆధునిక టెక్నాలజీతో చికిత్సలు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** సౌమ్య స్కిన్ అండ్ హెయిర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లో సోమవారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ సుంకి మాట్లాడుతూ.. చలికాలంలో ఎక్కువగా వచ్చే చర్మ వ్యాధులు మరియు హెయిర్ ఫాల్ సమస్యలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించారు. చలికాలంలో చర్మం పొడిబారడం, పాలిపోవడం, దద్దుర్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు సాధారణంగా ఎక్కువగా కనిపిస్తాయని తెలిపారు. ఈ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే సరైన వైద్యం తీసుకుంటే త్వరగా నియంత్రించవచ్చని ఆయన సూచించారు. చర్మ వ్యాధుల చికిత్స సాధారణంగా ఖర్చుతో కూడుకున్నదని, అందుకే ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు మరియు అవసరమైన మందులు అందించేందుకు ప్రతి సంవత్సరం ఈ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్యాంప్ ద్వారా అనేక మంది రోగులు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు.అలాగే చర్మవ్యాధులు మరియు హెయిర్ ఫాల్ సమస్యలకు తమ సౌమ్య స్కిన్ అండ్ హెయిర్ హాస్పిటల్‌లో అత్యుత్తమ ఆధునిక టెక్నాలజీతో సేవలు అందిస్తున్నామని డాక్టర్ కార్తీక్ సుంకి వెల్లడించారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో తక్కువ సమయంలో మంచి ఫలితాలు పొందేలా చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ ఉచిత హెల్త్ క్యాంప్‌ను స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన ప్రజలకు డాక్టర్ కార్తీక్ సుంకి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది మెడికల్ రీప్రజెంటేటివ్స్ తదితరులు పాల్గొన్నారు .

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ




**రాజేంద్రనగర్, విశాలభారతి:** గండిపేట మండలంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలైన కల్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే శ్రీ టి. ప్రకాష్ గౌడ్ గారు లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 104 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల కింద ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో పంపిణీ చేయబడింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ సంక్షేమ పథకాలు పేద మరియు మైనారిటీ కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో కుమార్తెల వివాహాల సమయంలో ఎదురయ్యే ఖర్చుల భారం తగ్గించడంలో ఈ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల గురించి పూర్తి అవగాహన కలిగి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలను ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందని, ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారులకు ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు

- అనాథాశ్రమంలో పిల్లలతో కలిసి కేక్ కట్ ..76 కేజీల బియ్యం విరాళం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. సుధీర్ ఫౌండేషన్ అనాథాశ్రమంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి ప్రత్యేకంగా జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ తెలుగు యువత మాజీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా ఆశ్రమంలోని పిల్లలకు ఆనందాన్ని పంచుతూ, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ మొత్తం 76 కేజీల బియ్యంను దానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజాసేవలో ఇలాగే చురుకుగా కొనసాగుతూ, భవిష్యత్ తరాలకు మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరుకుంటూ, ఆయన విశ్వసించే శ్రీ వెంకటేశ్వర స్వామి, ఇంద్రకీలాద్రి అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు మరాటి బిక్షపతి, ఎల్బీనగర్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కాటేపాక ప్రవీణ్ కుమార్, సాహిత్ కుమార్, సంతోష్ కుమార్, రాజు నాయక్, బాలు నాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ సీవీఎమ్ సి నూతన కమిటీ ఏర్పాటు




**విశాలభారతి, కొడంగల్ :** దౌల్తాబాద్ మండలకేంద్రంలో శుక్రవారం దళిత బహుజన శ్రమిక యూనియన్ వికారాబాద్ జిల్లా కార్యదర్శి లింగం సాయిలు ఆధ్వర్యంలో మండల స్థాయి సిటిజెన్ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా లింగం సాయిలు మాట్లాడుతూ దళిత బహుజన హక్కుల సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏర్పడిన కమిటీ ద్వారా హక్కులను కాపాడుకుందామని సూచించారు. అదేవిదంగా డి బి ఎస్ యూ సభ్యులు బి నర్సిములు,బాలరాజ్, కమిటీని ఉద్యేసించి మాట్లాడినారు. ఈ నూతన కమిటీ కో కన్వీనర్ గా కె ఆంజనేయులు, కన్వీనర్ గా పొలం మాదారమ్మ,కార్యవర్గ సభ్యులు అనంతమ్మ పోల్కంపల్లి, ఆంజనేయులు సుల్తాన్ పూర్ ,చందు, భాస్కర్, కాషాప్ప, భీమప్ప, హన్మంత్,తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**కాప్రా, విశాలభారతి:** కాప్రా ప్రాంతంలోని చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో 14 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించబడిన శ్రీ జయమంగళ పంచముఖ ఆంజనేయ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయబడింది. కార్యక్రమం మొత్తం భక్తి భావంతో, సంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా జరిగింది. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంలో సోలిస్ కంటి ఆసుపత్రి చైర్మన్ నందనంపాటి రామాంజనేయులు ఆలయంలో జరిగే కార్యక్రమాల కోసం వంట సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శివమణి స్వర్ణరాజ్, మాజీ కార్పొరేటర్ కొత్త రామా రావు, జె. కృష్ణమాచార్యులు, ఈ.ఓ., కమిటీ సభ్యులు పొట్టు బాబురావు, పడమటి మల్లారెడ్డి, ఉప్పల వినోద్ కుమార్, ఓర్ల శ్రీధర్ రెడ్డి, గూడ సత్యనారాయణ, పబ్బారి నరేందర్ గౌడ్, దేవాలయ జూనియర్ అసిస్టెంట్ టి.శ్రీనివాస్, శంకర్ బాబు, గజేందర్ రెడ్డి, ముకేష్, మోహన్, విశ్వం, విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 21.04.2026 సుదర్శన హోమం, చక్ర స్నానం మరియు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయని తెలియజేశారు.

# బస్సు షెల్టర్ కడతానంటే దుర్భాషలాడాడు

- ఓ దాతపై ఇరుసుకు పడ్డ గ్యాంగ్ మాన్
- అనుమతులు ఇచ్చి వెనక్కి తగ్గిన ఆర్ అండ్ బి అధికారులు
- ప్రజలకు మేలు చేకూరే పనులు చేస్తే తప్పా
- జిల్లా కలెక్టర్ ను దూషించిన గ్యాంగ్ మాన్






**అశ్వాపురం, విశాలభారతి :** దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించలేదన్న చందంగా ఆర్ అండ్ బి శాఖలో పనిచేస్తున్న ఓ గ్యాంగ్ మెయిన్ వ్యవహార శైలి నెలకొని ఉంది. ఆర్ అండ్ బి ప్రధాన రోడ్డు పక్కన ప్రజల సౌకర్యార్థం ఓ బస్ షెల్టర్ను కట్టేందుకు వెళ్లిన ఓ ప్రభుత్వ ఉద్యోగిపై నోటికొచ్చినట్లు విరుచుకుపడ్డాడు. అశ్వాపురం మండల కేంద్రంలో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులకు నిలువ నీడ కూడా లేకపోవడంతో అక్కడ ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు చలించిన ఓ దాత బస్సు షెల్టర్ కట్టి ప్రయాణికులకు ఇద్దామని నిర్ణయించుకున్నాడు. కానీ ఆయన ఆలోచన మొక్క దశలోనే తుంచేయడంతో మనస్థాపానికి గురవుతున్నాడు. అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన నలగట్ల సత్య ప్రకాష్ మణుగూరు లోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ గా ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్నాడు. అదేవిధంగా అశ్వాపురం స్టార్ లైన్స్ క్లబ్ కు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్నాడు. ఈ క్రమంలో ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూనే మండల కేంద్రం నుండి ఇతర పట్టణాలకు ప్రయాణించే ప్రయాణికులకు నిలువ నీడ కూడా లేకపోవడంతో బస్ షెల్టర్ నిర్మించాలని సంకల్పించాడు. ఈ క్రమంలో ఇక్కడ ప్రయాణికులకు బస్ షెల్టర్ లేకపోవడం వల్ల నెలకొని ఉన్న సమస్యలను గత మార్చి నెలలో జిల్లా కలెక్టర్ అంకిత్ కు ప్రయాణికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశాడు. అశ్వాపురంలో బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని వేడుకున్నాడు. అనంతరం జరిగిన పరిణామ క్రమంలో విషయాన్ని ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరరావు, డిఈ జి. సతీష్ కు తెలియజేశాడు. అయితే తొలుత విషయాన్ని ఈఈకి తెలపడంతో ఆయన డి ఈ కి ఈ బస్సు షెల్టర్ నిర్మాణం కు సంబంధించి ఓవరాల్ గా తెలియజేసి నిర్మించదలచుకున్న సత్య ప్రకాష్ కు సహకరించమని తెలిపాడు. దీంతో వీరిద్దరూ కలిసి ఈ నెల మొదటి వారంలో ప్రధాన సెంటర్ కు సమీపంలో ఉన్న ఆర్ అండ్ బి భవన సముదాయాల ముందు బస్సు షెల్టర్ నిర్మించేందుకు డి ఈ స్థలాన్ని సూచించినట్లు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు తెలిపాడు. ఇదిలా ఉంటే బస్సు షెల్టర్ నిర్మించేందుకు కావలసిన ఇనుప సామాగ్రిని ఆయన తీసుకొని నిర్మాణం చేపట్టే ప్రాంతానికి వెళ్ళాడు. దీన్ని గమనించిన ఆర్ అండ్ బి శాఖ లో పనిచేస్తున్న గ్యాంగ్ మాన్ తీవ్రమైన కోపోద్రిక్తుడై ఆయన ఓ ప్రభుత్వ ఉద్యోగి, ప్రిన్సిపల్ అన్న సంగతి కూడా మరచి ఇష్టానుసారం నోరు పారేసుకున్నాడు.

**ఈఈ, డిఈ లనే నోరు పారేసుకున్న గ్యాంగ్ మ్యాన్..**

అశ్వాపురం ఆర్ అండ్ బి శాఖలో గ్యాంగ్ మెయిన్ గా పని చేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తి బస్సు షెల్టర్ నిర్మాణం చేపట్టేందుకు ఆర్ అండ్ బి కార్యాలయం ముందున్న రోడ్డు వద్దకు తాను కొనుగోలు చేసిన రూ. 60వేల ఇనుప సామాగ్రిని తీసుకువెళ్లిన తనను సదరు గ్యాంగ్ మెన్ దుర్భాసలాడాడని సత్య ప్రకాష్ వాపోయాడు. తాను ఒక ప్రభుత్వ ఉద్యోగినన్న విషయాన్ని కూడా మరచిపోయి ఇక్కడ బస్సు షెల్టర్ నిర్మించడానికి నువ్వు ఎవరివి నీకు అనుమతులు ఇవ్వడానికి ఈఈ, డి ఈ ఎవడు జిల్లా కలెక్టర్ అయినా నా అనుమతి లేనిదే ఇక్కడ బస్ షెల్టర్ కట్టడానికి వీలులేదు. కాదు కూడదని నువ్విక్కడ బస్సు షెల్టర్ కట్టేందుకు ప్రయత్నిస్తే పురుగుల మందు తాగుతానని బెదిరించాడని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు తెలిపాడు. సదరు గ్యాంగ్ మ్యాన్ వ్యవహరించిన తీరు తనను కలిసివేసిందని వాపోయాడు. జరిగిన విషయాన్ని ఈ ఈ కి ఫోన్ ద్వారా తెలిపేందుకు ప్రయత్నించిన ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో మెసేజ్ ద్వారా తెలిపానని, తర్వాత డి ఈ కి ఫోన్ చేస్తే అక్కడ ప్రజలకు మీరు అనుకున్నంతగా సమస్య ఏమీ లేదని నేను చాలా ఒత్తిడిని ఎదుర్కొంటున్నానని మీరు షెల్టర్ కట్టాలనే ఆలోచనలు విరమించుకుంటే మంచిదని మాట మార్చారని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి ప్రజల ప్రయాణ సౌకర్యార్థం తాను నిర్మించదలచుకున్న బస్ షెల్టర్ నిర్మాణానికి మండల కేంద్రంలో స్థలాన్ని చూపించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## స్మార్ట్ ఫోన్లతో అంగన్వాడీలకు పని సులభతరం

- పోషణ పక్వాడ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం



**అశ్వాపురం, విశాలభారతి :** ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు అందిస్తున్న స్మార్ట్ ఫోన్లతో పని భారం మరింత సులభతరం అవుతుందని పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లున్నారు. సోమవారం మండల కేంద్రం లోని రైతు వేదికలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతూ అవసరం మేరకు పౌష్టిక ఆహారాలను క్రమం తప్పకుండా పంపిణీ చేస్తుందన్నారు. తొలుత గర్భిణీలకు సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు చేశారు. అదేవిధంగా ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు అందిస్తున్న స్మార్ట్ ఫోన్ లను ఆయన పంపిణీ చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమం ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన పౌష్టికాహారాలను అందజేస్తుందన్నారు. గర్భిణీలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారాలతో పాటు ప్రభుత్వ వైద్యుల సలహాలు సూచనలను నేరుగా అంగన్వాడీ కేంద్రాల వద్దనే అందజేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా హాజరై ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్వాడీల పనితీరుపై ఆయన ప్రశంసించారు. అంగన్వాడీ టీచర్లు ప్రభుత్వం చేపట్టే పలు కార్యక్రమాలలో పాలుపంచుకుంటూ వారందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఇక స్మార్ట్ ఫోన్ల పంపిణీ తో అంగన్వాడీ టీచర్లకు పని భారం మరింత సులువవుతుందన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తుందని, గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, తహసిల్దార్ సూర్యప్రకాష్, బూర్గంపాడు సిడిపిఓ, సూపర్వైజర్లు, సర్పంచులు బానోత్ సదర్ లాల్, భూ రెడ్డి స్వాతి, కొరసా కృష్ణ, కుంజా జాన్ ఉపసర్పంచులు, అశ్వాపురం, కళ్యాణపురం అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## బూర్గంపాడు సిడిపిఓగా స్వర్ణలత లెనినా చేసిన ప్రచారం ఎనలేనిది

- ఆమె సిడిపిఓగా చేసిన రోజుల్లో చేసే పనులను విస్తృత ప్రచారం
- ప్రచారంలో నిర్లక్ష్యం వహిస్తున్న బూర్గంపాడు ఐసిడిఎస్ అధికారులు



**అశ్వాపురం, విశాలభారతి :** బూర్గంపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టులో సిడిపిఓ గా పనిచేసిన స్వర్ణలత లేనినా ఆ రోజుల్లో ఆ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ప్రచారం మాధ్యమాలు, వార్తాపత్రికల ద్వారా ప్రచారం నిర్వహించుకోవడంలో ముందంజలో ఉండేవారు. ఐసిడిఎస్ అంగన్వాడి సెక్టార్లలో ఏ కార్యక్రమం చేపట్టిన పాత్రికేయులకు ముందస్తుగానే సమాచారాలు ఇస్తూ చేస్తున్న పనిని ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించుకునేవారు. అదేవిధంగా చేస్తున్న పనితో పాటు వారి కష్టాన్ని అటు ప్రభుత్వానికి ప్రజలకు తెలిసే విధంగా పత్రికలను ఉపయోగించుకోమని సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లకు వివరిస్తూ ఉండేది. అలా ఆమె చేస్తున్న పనిని ఒక మండలానికి కాక జిల్లా, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి తెలిసేలా వ్యవహరిస్తూ ఓ గుర్తింపుని తెచ్చుకుని నేడు జిల్లాస్థాయి అధికారిగా ఆమె సేవలు అందించడం విశేషమని చెప్పవచ్చని పలువురు అంటున్నారు. అయితే ప్రస్తుత బూర్గంపాడు ప్రాజెక్టులోనీ ఐసిడిఎస్ లో విధులు నిర్వహిస్తున్న అధికారులు వారు చేస్తున్న పనులను ప్రచారం నిర్వహించుకోవడంలో ఘోరంగా విఫలమవుతున్నారని విమర్శలు విలువత్తుతున్నాయి. ఇందుకు ఉదాహరణగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా అశ్వాపురం మండలంలో వారు చేపడుతున్న ఏ ఒక్క కార్యక్రమానికి పత్రికలకు సమాచారం ఇవ్వకపోవడంతో పాటు ప్రచారం కూడా చేసుకోవట్లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ 99 రోజుల్లో అసలు వారు ఏమి చేయాలన్న అంశం కూడా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజలకు తెలియడం లేదని సాక్షాత్తు కొందరు గర్భిణీలు, బాలింతలే అనడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఐసిడిఎస్ లో చేపడుతున్న కార్యక్రమాలను ప్రచారాల ద్వారా ప్రజల దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రసార మాధ్యమాలు, దినపత్రికలకు సమాచారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలి

**ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ 1300 మంది విద్యార్థులు చదువుతున్నారని వారిలో దాదాపు 560 మంది విద్యార్థులను ఉద్దేశపూర్వకంగా ఫెయిల్ చేసి వారి వద్ద నుంచి బ్యాక్ లక్స్ ఫీజు వసూలు చేయాలని కుట్ర పన్నుతున్నారని అన్నారు. 560 మంది విద్యార్థులను ఫెయిల్ చేసి 92 శాతం విద్యార్థులు పాసయ్యారని, కుటీల ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా పరిగనిస్తుందని అన్నారు. చేవెళ్లలో నడుస్తున్న ఎన్ఐఏటికి అనుమతి లేదు చేవెళ్ల ఎన్ఐఏటి విద్యార్థులను తమ చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ విద్యార్థులుగా చెప్పుకొని వారి వద్ద నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ.. వారి జీవితాలతో ఆడుకుంటున్నారని అన్నారు. కావాలని ఉద్దేశపూర్వకంగా బ్యాక్ లాక్స్ పేరుతో పరీక్ష ఫీజులు దండుకోవాలని 560 మంది విద్యార్థులను ఫెయిల్ చేశారని అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యూజీసీకీ, (యూనివర్సిటీస్ గ్రాంట్ కమిషన్) ఉన్నత విద్యాశాఖకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. చైతన్య యూనివర్సిటీకి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులకు రివాల్యుయేషన్ సౌకర్యం కల్పించి వారు పరీక్ష రాసిన పేపర్లను విద్యార్థులకు చూపించాలని, ఎస్ఎఫ్ఐ సవాలు విసురుతోందని అన్నారు. విద్యార్థులకు న్యాయం చేయకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ముందు నిరవధిక ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అశోకన్న వర్గంలో 50 కుటుంబాలు చేరిక




**కండువా కప్పి ఆహ్వానించిన తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా**

**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లాలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సోమవారం రాజీనామా చేసి సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అశోకన్న వర్గంలో చేరారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్న ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సట్ల యాకన్న, జాటోత్ బిక్షపతి తదితర నాయకులతో పాటు సుమారు 50 కుటుంబాలు న్యూడెమోక్రసీ పార్టీలోకి చేరాయి. కొత్తగా చేరిన వారికి అశోకన్న పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోకన్న మాట్లాడుతూ, కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి స్ఫూర్తితో సాగుతున్న ప్రతిఘటన పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. భూమి, భుక్తి, విముక్తి కోసం న్యూడెమోక్రసీ పార్టీ చేపడుతున్న పోరాటాలను చూసి ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఇక చేరిన నాయకులు సట్ల యాకన్న, జాటోత్ బిక్షపతి మాట్లాడుతూ, మాస్ లైన్ సిద్ధాంతాలు తమకు నచ్చకపోవడంతో రాజీనామా చేసి అశోకన్న నాయకత్వంలోని న్యూడెమోక్రసీ పార్టీలో చేరామని తెలిపారు. ఇకపై పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత, ఏఐకేఎంఎస్ నాయకులు ఇరుగు నాగన్న, దేవులపల్లి నర్సిరెడ్డి, భాగ్యలక్ష్మి, పి వై ఎల్ నాయకులు గణేష్, పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

**చేరిన వారి కుటుంబాల పట్టిక.**

భానోత్ వీరన్న, ధారంగుల వెంకన్న, బోయిని యాకయ్య, బానోతు సర్దార్ లాల్, లాకావత్ బాల్యా, సభావట్ బిచ్చ, భూక్య బాలు, మాలోతు నరేష్, ధరంగుల సురేష్, మారేష్ , శ్రీను, ఓర్సు సైదులు, ధరంగుల సంపత్, యకేష్, తమిడ్ శెట్టి రాములు, బోయిని ఉప్పలయ్య, ఎస్.కె పాషా, పునపుర్తి సోమయ్య, భుఖ్య శ్రీను, దేగడి రామ తార, కందు మల్ల ప్రమీల, దారిపల్లి లక్ష్మి, నవీన్ , హర్ష, జల్లి శ్రావణి, జల్లి ప్రశాంత్, చుక్క వినయ్, సంగీతా రావు, గుగులోతు దేవి, బుగులవత్ నరేష్, సునీత, చిత్రం అశోక్, పానుగంటి రాజు, సట్ల ప్రశాంత్, సట్ల సంతోష్, లాకావత్ బాల్య, లాకావత్ మంగ్య, బానోతు క్రాంతి కుమార్, సట్ల రమక్క, భోగ శ్రావణి, అక్కినపల్లి ఉమా, వార్త రమేష్, కురవి ప్రసాద్, సాగర్, పోతుగంటి పెట్టయ్య, సోమరపు శారద, బుర్ర స్వరూప, బాలాజీ, సోమన్న, ఓరుగంటి పవన్, ఆలకుంట్ల వెంకటేశ్వర్లు, ఆలకుంట్ల మలేష్, ఓర్సు నరసింహ, ఓర్సు మహేష్, లు చేరారు.

## 99 డేస్ ఆఫ్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమం

**రాజేంద్రనగర్, విశాలభారతి :**



"99 డేస్ ఆఫ్ యాక్షన్ ప్లాన్" కార్యక్రమంలో భాగంగా "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కింద పట్టణ సమాజ అభివృద్ధి (UCD) కార్యకలాపాలు మరియు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం కిస్మత్‌పూర్ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ అవగాహన సమావేశానికి మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు చెందిన అధికారులు మరియు సిబ్బంది పాల్గొని, తమ తమ విభాగాల ద్వారా అమలవుతున్న పథకాల గురించి సమగ్రంగా వివరించారు. ప్రతి విభాగం తమ లక్ష్యాలు, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం మరియు లబ్ధిదారులకు లభించే ప్రయోజనాలను స్పష్టంగా తెలియజేశారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై విస్తృతంగా చర్చ జరిగింది. వాటిలో: ఇందిరా మహిళా శక్తి పథకం – మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల పెంపు కోసం తీసుకొచ్చిన పథకం. ఫ్రీ బస్ పథకం – మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం ద్వారా వారి ప్రయాణ సౌలభ్యం పెంపు. గృహలక్ష్మీ పథకం – అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే ముఖ్యమైన సంక్షేమ పథకం. గృహజ్యోతి పథకం – విద్యుత్ వినియోగంపై రాయితీలు అందించి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించే పథకం.అలాగే ఇతర పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కూడా వివరాలు అందించారు. అధికారులు ఈ పథకాల ద్వారా లభించే ప్రయోజనాలను ప్రజలకు చేరవేసి, అర్హులైన వారు తప్పకుండా నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ, అవసరమైన మార్గదర్శకాలను కూడా అందించారు. ఈ కార్యక్రమంలో UCD సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, స్థానిక మహిళా సంఘ సభ్యులు మరియు ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## హయత్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో స్వాధీనం చేసిన వాహనాల వేలం

- 12 వాహనాలను చట్ట ప్రకారం పబ్లిక్ ఆక్షన్‌కు సిద్ధం చేసిన అధికారులు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎన్‌డిపిఎస్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను చట్టపరమైన నిబంధనల మేరకు ప్రజా వేలం ద్వారా విక్రయించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO) జె. ధనవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన మీడియా ద్వారా తెలియజేస్తూ, మొత్తం 12 వాహనాలను 2026 ఏప్రిల్ 21వ తేదీ (మంగళవారం) ఉదయం 10 గంటలకు పబ్లిక్ ఆక్షన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడుతుందని, ఆసక్తి గల వ్యక్తులు నేరుగా హాజరై పాల్గొనవచ్చని సూచించారు. ఎక్సైజ్ అధికారుల ప్రకారం, ఈ వాహనాలు గత కొంతకాలంగా వివిధ ఎన్‌డిపిఎస్ (NDPS) కేసుల్లో స్వాధీనం చేయబడ్డవిగా గుర్తించారు. వీటిలో హోండా డియో, హోండా యాక్టివా, హీరో హోండా స్ప్లె డర్ ప్లస్, హోండా సీబీ షైన్, కియా కేరెన్స్, హ్యుందాయ్ ఈయాన్ ఎరా ప్లస్, రెనాల్ట్ ట్రైబర్, బజాజ్ పల్సర్ వంటి ద్విచక్ర, నాలుగు చక్ర వాహనాలు ఉన్నాయి. వాహనాల వేలం ప్రక్రియకు సంబంధించి మరిన్ని వివరాల కోసం ఆసక్తి గల వారు 8712658743 నంబర్‌కు ఫోన్ ద్వారా లేదా నేరుగా హయత్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని ఎస్హెచ్ఓ జె. ధనవంత్ రెడ్డి తెలిపారు. అంతేకాకుండా, వేలంలో పాల్గొనే వారు సంబంధిత నిబంధనలు పాటిస్తూ ముందస్తుగా సమాచారాన్ని తెలుసుకోవాలని అధికారులు సూచించారు. ఈ ఆక్షన్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడమే కాకుండా, స్వాధీనం చేసిన వాహనాల వినియోగం కూడా సక్రమంగా జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

## చిలుకూరులో బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా



**మొయినాబాద్, విశాలభారతి:** కులమతాలకు అతీతంగా సమానత్వాన్ని కోరుకున్న మహనీయుడు బసవేశ్వరుడు అని, ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని వీరశైవలింగాయత్ సమాజం మండల అధ్యక్షుడు, చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి అన్నారు.మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం సమీపంలో ఉన్న కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే చిలుకూరు సమీపంలోని పురాతన శివాలయంలో గత 25 ఏళ్లుగా నిత్య పూజలు చేస్తున్న శివభక్తుడు గున్నాల అంజిరెడ్డిని సన్మానించారు. దూపదీప నైవేద్యాలు, పూజా కైంకర్యాల నిర్వహణకు అవసరమైన సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా పురాణం వీరభద్రస్వామి మాట్లాడుతూ, శివపూజ, శివస్పర్శ ఎవరికైనా సాధ్యమని బసవేశ్వరుడు తన జీవితంలోనే ఆచరణలో పెట్టారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వీరశైవలింగాయత్ సమాజ నాయకులు చాట్ల బిక్షపతి, సంఘమేశ్వర్, బస్వరాజ్, వజ్రలింగం తదితరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా బంగారు మైసమ్మ ఆలయ పదవ వార్షికోత్సవం



**సికింద్రాబాద్, విశాలభారతి :** మధురా నగర్ లో కొలువైన బంగారు మైసమ్మ అమ్మవారి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతాఫల్ మండి డివిజన్ లోని మధురా నగర్ బంగారు మైసమ్మ ఆలయాన్ని నిర్మించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన వార్షికోత్సవ పూజలకు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అమ్మవారి ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయనను నిర్వాహకులు సన్మానించారు. ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేసిన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. ఎమ్మెల్యే అధ్యక్షుడు బాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, ఉపాధ్యక్షుడు ప్రకాష్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మహేందర్ గౌడ్, శైలేందర్, రవీంద్ర సాగర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్



**సికింద్రాబాద్, విశాలభారతి :** బౌద్ధ నగర్ డివిజన్ సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ను మర్యాదపూర్వ కలిసి డివిజన్ లొని అంబర్ నగర్ పార్సిగుట్ట సంజీవపురం బౌద్ధ నగర్ ఎల్.నారాయణ నగర్ న్యూ అశోక్ నగర్ వారాసిగూడ ఈశ్వరి బాయి నగర్ ల లో నెలకొన్న పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించడం జరిగిందని డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ తెలిపారు. రహదారులు, సామాజిక భవనాల నిర్వహణ, అంబర్ నగర్ లో బాల్వాడి స్కూల్ నూతన నిర్మాణం, అశోక్ నగర్ అర్బన్ డెవలప్మెంట్ యొక్క రెండవ అంతస్తు. అంబర్ నగర్ బస్తీ దావాఖానా రెండవ అంతస్తు ఏకశిర మెడికల్ హాల్ ట్రాన్స్ఫార్మర్ వద్ద కమిటీ హాల్ అశోక్ నగర్ హనుమాన్ దేవాలయం పక్కన కమిటీ హాల్ నిర్వహణ మరమ్మతు పనుల గూర్చి, అశోక్ నగర్ ప్రధాన రహదారి, అంతర్గత రహదారులు, సెంట్ ఆల్బన్ స్కూల్ నుండి మమతా మెడికల్ షాప్ వరకు ఉన్న డ్రైన్ యొక్క పూడికతీత స్లాబ్ నిర్మాణము సిమెంటు రోడ్డు పనులు , పుల్లయ్య భాయి పాత పద్మ గ్యాస్ ప్రధాన రహదారి.పార్సిగుట్ట. బౌద్ధ నగర్ రోడ్ నెంబర్ 7 అంబర్ నగర్ సరస్వతి స్కూల్ వద్ద అంతర్గత సిసి రోడ్లను వెంటనే పూర్తి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ద్వారా కమిషనర్ కు లిఖితపూర్వకంగా స్థానిక బస్తీ వాసుల వినతులను అందజేయడం జరిగిందని బౌద్ధనగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ తెలిపారు.

## ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు



**సికింద్రాబాద్,విశాలభారతి :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు 76 వ పుట్టినరోజు వేడుకలు సికింద్రాబాద్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెదేపా సీతాఫలమంది డివిజన్ అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో నామాలగుండు కూడలిలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలుగుదేశంపార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ హాజరై కేక్ కట్ చేసి, పండ్లు పంచి పెట్టారు. మధుర నగర్ లోని బంగారు మైసమ్మ ఆలయంలో వల్లారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుట్టి వేలోడి ఆసుపత్రిలో రోగులకు సిబ్బందికి, మరియు స్థానిక అంగన్వాడీ సెంటర్ లో పండ్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెద, బడుగు, బలహీనవర్గాల శ్రేయస్సు కోసం, అభివృద్ధికోసం అహర్నిశలు కష్టపడే ఏకైక వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు.ఈకార్యక్రమంలో తెదేపా సీతాఫలమండి డివిజన్ అధ్యక్షుడు సీనియర్ నాయకులు విజయ్, జగదీష్, రమాదేవి, పూజా, దీపు, సాయి టైలర్, శ్రీనివాస్ శంకర్ ముదిరాజ్, వెంకటస్వామి, దేవేందర్, డెంటల్ ప్రవీణ్ ,చిరంజీవిరాజు, శేషిరేఖ, మురళీకృష్ణ, చందర్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శ్రీ మహ్మద్ మెహమూద్ అహ్మద్ గారు, తండ్రి: అబ్దుల్ మన్నాన్, వయసు: 38 సంవత్సరాలు, వృత్తి: సోఫా తయారీ, నివాసం: అయేషా జహూర్ మస్జిద్ సమీపం, చింతల్‌మెట్, అత్త పూర్, హైదరాబాద్. స్వస్థలం: సికిందర్‌పూర్ గ్రామం, పరస్రాంపూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. నిందితుడి పేరు మరియు చిరునామా: సయ్యద్ మజహర్ అలియాస్ మహమూద్, తండ్రి: సయ్యద్ మహబూబ్, వయసు: 40 సంవత్సరాలు, వృత్తి: ఫర్నిచర్ పని, నివాసం: 1311235/174/A, ఆసిఫ్ నగర్, హైదరాబాద్. కేసు వివరాలు: సుమారు 15 సంవత్సరాల క్రితం ఫిర్యాదుదారు తన స్వస్థలం నుండి హైదరాబాద్‌కు వచ్చి సోఫా తయారీ వృత్తి ద్వారా జీవనం కొనసాగిస్తున్నాడు. గత 5 సంవత్సరాలుగా అట్టాపూర్‌లోని సులేమాన్ నగర్, నానాకీ మస్జిద్ సమీపంలో ఉన్న మెట్రో ఫర్నిచర్ షాప్‌లో యజమాని మహ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నాడు. అతని వద్ద సోహైబ్ మరియు అజీజ్ అనే ఇద్దరు సహాయకులు కూడా పనిచేస్తున్నారు. సుమారు రెండు నెలల క్రితం మహమూద్ అనే కార్మికుడు పనిలో నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగం నుండి తొలగించబడ్డాడు. అతని స్థానంలో అజీజ్‌ను నియమించారు. అనంతరం మహమూద్ పలుమార్లు షాపుకు వచ్చి ఫిర్యాదుదారుని బెదిరించాడు. 19.04.2026 తేదీన ఉదయం సుమారు 12:00 గంటల సమయంలో అమీర్ అనే మరో కార్మికుడు ఫిర్యాదుదారునికి ఫోన్ చేసి, తెలియని వ్యక్తి అజీజ్‌పై దాడి చేశాడని, అతడిని ఆసుపత్రికి తరలిస్తున్నారని తెలిపాడు. వెంటనే ఫిర్యాదుదారు తన సహాయకుడు సోహైబ్‌తో కలిసి హైటెక్ సిటీ ప్రాంతం నుండి షాపుకు చేరుకున్నారు. అక్కడ యజమాని మహ్మద్ ఇమ్రాన్ కూడా ఉన్నాడు. షాపులోని సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా, ఉదయం 11:30 గంటల సమయంలో ఉద్యోగం నుండి తొలగించబడిన మహమూద్ షాపులోకి వచ్చి, నిద్రలో ఉన్న అజీజ్‌పై తెలియని వస్తువుతో దాడి చేసినట్లు కనిపించింది. ఉద్యోగం కోల్పోయిన కారణంగా మహమూద్ ఫిర్యాదుదారుడు మరియు అజీజ్‌పై ద్వేషం పెంచుకొని, అతన్ని హత్య చేయాలనే ఉద్దేశంతో దాడి చేసినట్లు వెల్లడైంది. అందువల్ల నిందితుడిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరాడు. అదే రోజు (19.04.2026) సాయంత్రం అరాంఘర్ క్రాస్ రోడ్ వద్ద నిందితుడు ఉన్నాడని సమాచారం అందడంతో, పోలీసులు అక్కడికి వెళ్లి సుమారు 18:00 గంటలకు సయ్యద్ మజహర్ అలియాస్ మహమూద్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు మరియు LW16 ముందు హాజరు పరిచారు. పూర్తి విచారణలో నిందితుడు ఈ నేరాన్ని ఒప్పుకున్నాడు. అనంతరం మధ్యవర్తులుగా LW13 శ్రీ సయ్యద్ నూర్ అహ్మద్, LW14 శ్రీ మొహమ్మద్ ఆసిఫ్‌లను పిలిపించి, వారికి నేర వివరాలు తెలియజేసి నిందితుడి ఒప్పుకోలు నమోదు చేశారు. నిందితుడి ఒప్పుకోల ఆధారంగా LW16 ఒక బ్లేడ్ (సుమారు 4 సెం.మీ పొడవు, 2 సెం.మీ వెడల్పు, రెండు వైపులా పదునైనది, "విలకిన్సన్ స్వర్డ్ – A గిల్లెట్టే ప్రోడక్ట్ " అని ఒక వైపు, "విలకిన్సన్ స్వర్డ్ – స్టైన్లెస్ స్టీల్ " అని మరో వైపు వ్రాయబడినది) మరియు ఒక నలుపు రంగు రెడీమి 5G మొబైల్ ఫోన్ (నంబర్: 9885430675, IMEI1: 869089071021847, IMEI2: 869089071021854) ను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్వాధీనం ప్రక్రియ మధ్యవర్తుల సమక్షంలో వారి సంతకాలతో పూర్తిచేయబడింది.

# మెదక్ రైతులను ముంచిన అకాలవర్షం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అకస్మాత్తుగా విరుచుకుపడ్డ ప్రకృతి ప్రకోపానికి అన్నదాతలు చితికిపోయారు. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా కురిసిన వడగళ్ల వాన, బలమైన ఈదురు గాలులు రైతన్నల ఆశలపై నీళ్లు చల్లాయి. సంగారెడ్డి, సిద్ధిపేట, మెదక్ జిల్లాల్లోని వేలాది ఎకరాల్లో పంటలు తుడిచిపెట్టుకుపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడుతున్న జనాలకు వాతావరణంలో సంభవించిన మార్పులు ఊరటనిస్తాయని భావించినా, అవే వానలు రైతులకు తీరని వేదనను మిగిల్చాయి. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. నారాయణఖేడ్, సదాశివపేట, జహీరాబాద్‌తో పాటు కంది ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలుల బీభత్సానికి మామిడి తోటలు కుదేలయ్యాయి. కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన కాయలు చేతికి అందే సమయంలో నేలపాలయ్యాయి. పిందె దశ నుంచి ఎంతో జాగ్రత్తగా చూసుకున్న పంట మార్కెట్‌కు తరలించే తరుణంలో రాలిపోవడంతో లక్షలాది రూపాయల పెట్టుబడి గాలిలో కలిసిపోయింది. తోటల నిండా రాలిన కాయలను చూస్తూ రైతులు కంటతడి పెడుతున్నారు. ఇప్పటికే పెరిగిన పెట్టుబడి ఖర్చులకు తోడు ప్రకృతి వైపరీత్యాలు తమను కోలుకోలేని దెబ్బ తీశాయని తోట యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లాలో పరిస్థితి మరింత భయానకంగా ఉంది. రామాయంపేట, చేగుంట, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల్లో రాత్రి కురిసిన వర్షం వరి రైతులను నిండా ముంచింది. కోతకు వచ్చిన పంట ఒక్కసారిగా నేలకొరగడంతో పాటు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వరదలో కొట్టుకుపోయింది. సాయంత్రం వరకు భానుడి భగభగలతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కారు మబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం విరుచుకుపడటంతో ధాన్యాన్ని కాపాడుకునే సమయం కూడా దక్కలేదు. రోడ్లపై, మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ప్రభుత్వ ప్రాథమిక అంచనాల ప్రకారం మెదక్ జిల్లాలో



సుమారు 4777 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇందులో అత్యధికంగా 4701 ఎకరాల్లో వరి పంట దెబ్బతినగా, మొక్కజొన్న, మామిడి తోటలకు కూడా గణనీయమైన నష్టం వాటిల్లింది. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. ఈ గణాంకాలు కేవలం ప్రాథమికం మాత్రమేనని, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే నష్టం తీవ్రత ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. వడగళ్ల వాన ప్రభావంతో వరి కంకులు రాలిపోవడం, ధాన్యం రంగు మారడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రకృతి వైపరీత్యానికి ఆగ్రహించిన రైతన్నలు రోడ్డెక్కి నిరసన తెలిపారు. చేగుంట, నార్సింగి మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు కర్నాల్‌పల్లి - మక్కరాజ్‌పేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి తమ గోడు వినాలని, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి తమను ఆదుకోవాలని నినదించారు. ధర్నా కారణంగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తమ కష్టం కళ్ల ముందే కొట్టుకుపోతుంటే తాము ఎలా ఊరుకుంటామని బాధితులు నిలదీశారు. అకాల వర్షాల గండం ఇంకా తొలగిపోకపోవడం రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. రాష్ట్రంలో ఈ నెల 27 వరకు వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ ప్రకటించడంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అన్న భయం అలుముకుంది. గాలివానల ధాటికి మిగిలిన పంటనైనా కాపాడుకోవాలని రైతులు తమకు తోచిన ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచనలు ఇస్తున్నారు. సిద్ధిపేట జిల్లాలోని పలు మండలాల్లోనూ వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది. అక్కడక్కడ కురిసిన వడగళ్ల వానకు కూరగాయల తోటలు, పూల తోటలు ఛిద్రమయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంట చివరి నిమిషంలో కళ్లముందే నాశనమవ్వడం రైతు కుటుంబాల్లో చీకట్లు నింపింది. అప్పులు తెచ్చి సాగు చేసిన తమకు ఇప్పుడు ప్రభుత్వం అందించే సాయమే దిక్కని, తక్షణమే ఆర్థిక తోడ్పాటు అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల సాకుతో తిరస్కరించకుండా మద్దతు ధరకు సేకరించాలని రైతులు కోరుతున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నా, రంగు మారినా మానవీయ కోణంలో ఆలోచించి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్ల సరఫరాలో విఫలమయ్యారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఒక్క అకాల వర్షం జిల్లా ఆర్థిక వ్యవస్థపైనే ప్రభావం చూపింది. మామిడి ఎగుమతులు తగ్గడం వల్ల ధరలు పెరిగే అవకాశం ఉండగా, మరోవైపు రైతులకు ఆదాయం కోల్పోవడం వల్ల కొనుగోలు శక్తి తగ్గుతుంది. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో బీమా పథకాలు సరిగ్గా వర్తించకపోవడం, ప్రభుత్వ పరిహారం అందడంలో జాప్యం జరగడం అన్నదాతలను క్రుంగదీస్తోంది. ఏటా ఇలాంటి పరిస్థితులే ఎదురవుతున్నా శాశ్వత పరిష్కారం వైపు అడుగులు పడటం లేదు. రైతు పండించిన ప్రతి గింజకు భద్రత కల్పించే వ్యవస్థ కావాలని సామాన్య ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ధాన్యం నిల్వ చేసేందుకు సరిపడా గోదాములు లేకపోవడం, వాన వస్తే కప్పేందుకు సరైన వసతులు లేకపోవడం వల్ల ప్రతి ఏటా ఇదే కథ పునరావృతమవుతోంది. రైతులు తమ సొంత ఖర్చుతో కూలీలను పెట్టుకుని ధాన్యాన్ని కాపాడుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, బాధితులకు మనోధైర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరాకు లెక్క కట్టి పారదర్శకంగా సాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. చూస్తే ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగం ఇప్పుడు గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ఆకాశం నుంచి కురిసిన నీరు వారి కళ్లలో కన్నీరుగా మారింది. పాలకుల హామీలు ఆచరణలో కనిపిస్తేనే వారి ఇళ్లలో వెలుగులు నిండుతాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రానున్న వారం రోజులు అత్యంత కీలకంగా మారాయి. అధికారులు, నాయకులు క్షేత్రస్థాయిలో ఉండి రైతులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రకృతి కన్నెర్ర చేసినా, మానవత్వం తోడైతేనే అన్నదాత మళ్లీ నాగలి పట్టగలడు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

## సోషల్ మీడియాలో అనసూయపై అసభ్యకర పోస్టులుయువకుడి అరెస్ట్



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** సోషల్ మీడియాలో నటి అనసూయ భరద్వాజ్‌పై అసభ్యకర, పరువు నష్టం కలిగించే కామెంట్లు పోస్ట్ చేసిన కేసులో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నల్గొండ జిల్లాకు చెందిన యువకుడిని అరెస్ట్ చేశారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి. సాయి మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం, నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలం అల్వాల గ్రామానికి చెందిన దొరెపల్లి చంటి (30) ఇన్‌స్టాగ్రామ్‌లో @ chantidhorapally పేరుతో అకౌంట్ నిర్వహిస్తున్నాడు. 2025 డిసెంబర్ 23 నుంచి పలువురు వ్యక్తులు, సోషల్ మీడియా పేజీలు తనపై అసభ్యకర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, దీంతో తన పరువుకు భంగం కలిగిందని అనసూయ ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 81/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 75, 79, 336(4), 351, 356 మరియు ఐటీ చట్టం 66E, 67 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు డీసీపీ సాయి మనోహర్ తెలిపారు. విచారణలో నిందితుడు చంటి అనసూయను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకర ఎలక్ట్రానిక్ కంటెంట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు తేలడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. సోషల్ మీడియాలో ఎవరైనా అసభ్యకర, పరువు నష్టం కలిగించే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని డీసీపీ సాయి మనోహర్ హెచ్చరించారు. డిజిటల్ వేదికలను బాధ్యతగా వాడుకోవాలని, సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా దగ్గరలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. నిందితుడిపై తదుపరి విచారణ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

## ఇంటర్, ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

- సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సీ (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ TOSS) పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ ఆంక్షలు విధించింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఐపీఎస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 2026 ఏప్రిల్ 20 నుంచి 27 వరకు జరిగే పరీక్షల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ, అవాంఛనీయ ఘటనల నివారణ కోసం బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం, సైబరాబాద్ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధం. అలాగే పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలి. ఈ నిబంధనలు ఏప్రిల్ 20 నుంచి 27 వరకు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని కమిషనర్ పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సైనిక సిబ్బంది, హోంగార్డులు, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చినట్లు సీపీ డాక్టర్ రమేష్ వెల్లడించారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు సహకరించి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఆయన కోరారు.

## నాయకత్వం అంటే సేవజగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** "నాయకత్వం అంటే అధికారంలో ఉండటం కాదు, సేవ చేయడం. బ్యాడ్జ్ అలంకారం కాదు, అది బాధ్యతకు ప్రతీక" అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మదీనాగూడ డివిజన్ రామకృష్ణనగర్‌లోని కల్లం అంజి రెడ్డి విద్యాలయంలో జరిగిన "ఇన్వెస్టిచర్ సెరిమనీ"లో పాల్గొని విద్యార్థి నాయకులకు బ్యాడ్జ్‌లు అందజేశారు. 'ఈ రోజు మీరు స్కూల్ లీడర్స్, రేపు దేశాన్ని నడిపించే నాయకులు. నిజాయితీ, క్రమశిక్షణ, కర్తవ్యబద్ధత మీ నాయకత్వానికి ఆధారాలు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మార్గదర్శకతే మీ విజయానికి పునాది" అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లం అంజి రెడ్డి విద్యాలయం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, స్థానిక కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్

## ఛాంపియన్‌షిప్ కైవసం

**భద్రాచలం, విశాలభారతి:** రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభంజనం మాస్టర్స్ టీమ్ ఛాంపియన్‌షిప్' కైవసం హైదరాబాద్‌లోని సనత్ నగర్‌లో ఈ నెల 18, 19 తేదీలలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. జిల్లా జట్టు 'మాస్టర్స్ టీమ్ ఛాంపియన్‌షిప్' ట్రోఫీని కైవసం చేసుకున్నట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.వి. రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

**విజేతల వివరాలు:**

**వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు వీరే:**

**మహిళల విభాగం:** డి. మేఘనా చౌదరి 69 కేజీలు కాంస్యంమామిడి భూమిక 76 కేజీలు కాంస్యం

**సబ్ జూనియర్ మరియు జూనియర్:** ఎండి యాసిన్ 59 కేజీలు కాంస్యం, మోడల్ వంశీ 66 కేజీలు స్వర్ణం మాస్టర్స్ 1: పి. రాజేష్ 83 కేజీలు స్వర్ణం బట్టు శ్రీను, బి. సామ్రాట్, జి. దివాకర్ రజత పతకాలు మోతిలాల్ 105 కేజీలు కాంస్యం.




**మాస్టర్స్2:** కొమరెల్లి రవీందర్ రెడ్డి 93 కేజీలు స్వర్ణం ఎం. రంగారావు 105 కేజీలు స్వర్ణం జె. రామకృష్ణ, కె. భవానీ శంకర్, మహంతి వెంకట కృష్ణాజి, బి. కరుణకుమార్ రజత పతకాలు. బి. శేషు, ఐ. వెంకటేశ్వరరావు కాంస్య పతకాలు

**మాస్టర్స్3 ,4:** ఎం. వెంకటకృష్ణ, డి.వి. శంకర్రావు, మహమ్మద్ అబ్బాస్ స్వర్ణ పతకాలు గౌర్రె దుర్గేష్

**రజత పతకం**

ఈ సందర్భంగా విజేతలను తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. మల్లేష్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ ప్రతినిధులు మరియు పలువురు రాజకీయ ప్రముఖులు అభినందించారు.

## గచ్చిబౌలి అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో భారీ అగ్ని ప్రమాదం



- 15 బైకులు దగ్ధం
- ఫైర్ సేఫ్టీపై స్థానికుల ఆందోళన

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని టీఎన్జీవో కాలనీలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం 8 గంటల ప్రాంతంలో సెల్లార్‌లోని ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

**ఘటన వివరాలు....**

మంటలు క్షణాల్లోనే పక్కనే పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలకు అంటుకోవడంతో 15 బైకులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదం కారణంగా సెల్లార్ నుంచి వెలువడిన దట్టమైన నల్లటి పొగ అపార్ట్‌మెంట్‌లోని అన్ని అంతస్తులను కమ్మేసింది. దీంతో నివాసితులు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు నివాసితులు భయంతో బాల్కనీల్లోకి, టెర్రస్‌పైకి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే గచ్చిబౌలి పోలీసులు, మాదాపూర్ అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది సుమారు 45 నిమిషాల పాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అదే సమయంలో పోలీసులు అపార్ట్‌మెంట్‌లోని మొత్తం 28 ఫ్లాట్ల నివాసితులను సురక్షితంగా బయటకు తరలించారు. సకాలంలో స్పందించడం వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు నిర్ధారించారు.

**స్థానికుల భయాందోళనలు:**

ఈ ఘటనతో టీఎన్జీవో కాలనీ వాసులతో పాటు చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల నివాసితులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. "సెల్లార్‌లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు పని చేయడం లేదు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గం కూడా వస్తువులతో మూసుకుపోయి ఉంది. ఇవాళ బైకులు కాలాయి, రేపు మనుషులు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది" అని స్థానిక మహిళా నివాసి ఆవేదన వ్యక్తం చేసింది. చాలా అపార్ట్‌మెంట్లలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ జరగడం లేదని, పాత వైరింగ్‌ను మార్చడం లేదని పలువురు ఆరోపించారు.

**పోలీసుల విచారణ**

ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణం షార్ట్ సర్క్యూటేనా లేక నిర్వహణ లోపమా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు సైతం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అపార్ట్‌మెంట్‌లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించారా, ఎన్‌ఓసీ ఉందా, ఎలక్ట్రికల్ ఆడిట్ ఎప్పుడు చేయించారనే అంశాలపై అసోసియేషన్ ప్రతినిధులను విచారిస్తున్నారు. కాలిపోయిన వాహనాల విలువ సుమారు రూ. 12 లక్షల వరకు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ నేపథ్యంలో నగరంలోని అన్ని అపార్ట్‌మెంట్ల అసోసియేషన్లు వెంటనే ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేయించుకోవాలని, ఎలక్ట్రికల్ వైరింగ్‌ను తనిఖీ చేయించాలని, సెల్లార్లలో చెత్తాచెదారం లేకుండా చూడాలని అధికారులు హెచ్చరించారు.

## అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ

- పద్మావతీ వెంకటేశ్వరుల కళ్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు
- జనప్రియనగర్ ఫేజ్-2లో ఘనంగా 13వ వార్షికోత్సవ వేడుకలు



స్వామి వారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్ ఫేజ్ 2 కాలనీలోని శ్రీ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ పద్మావతీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కృపతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, కాలనీవాసులకు ఆయురారోగ్యాలు కలగాలని ఎమ్మెల్యే గాంధీ ఆకాంక్షించారు. ఆలయ కమిటీని, భక్తులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి అక్తర్, దాత్రి నాథ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, జనప్రియ శ్రీనివాస్, హరికృష్ణ, రామకృష్ణ, సుధీర్, సుధాకర్ దాస్, జయసూర్య, సురేష్, నాగేశ్వర్ రావు, భక్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బసవన్న స్ఫూర్తితో సేవా కార్యక్రమం

- 893వ జయంతి సందర్భంగా 200 మంది మహిళలకు చీరల పంపిణీ
- హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా బసవేశ్వరుని జయంతి వేడుకలు



బసవేశ్వర జయంతిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కొండా విజయ్ ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** శ్రీ మహాత్మా బసవేశ్వరుని 893వ జయంతి సందర్భంగా హఫీజ్‌పేట్ డివిజన్ హుడా కాలనీలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. బసవేశ్వరుని చిత్రపటానికి నివాళులు అర్పించి, 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, "సమానత్వం కోసం పోరాడిన సామాజిక విప్లవకారుడు బసవేశ్వరుడు. కుల, మత భేదాలు రూపుమాపేందుకు, స్త్రీపురుష అసమానతలు తొలగించేందుకు ఆయన చేసిన కృషి అనిర్వచనీయం అని కొనియాడారు. లింగాయత్‌ల అభివృద్ధి కోసం కోకాపేటలో బసవ భవన్‌కు స్థలం కేటాయించి రూ.10 కోట్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. బసవన్న చూపిన బాటలో నడిచి సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకం" అని పిలుపునిచ్చారు. హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ సామాజిక సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున్ శర్మ, బుచ్చిరెడ్డి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎదురుగడ్డల మైసమ్మ తల్లి ఆలయ నాల్గవ వార్షికోత్సవం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న సాయిబాబా

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని మధురా నగర్ కాలనీలో కొలువైన ఎదురుగడ్డల మైసమ్మ తల్లి ఆలయ నాల్గవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, కాలనీవాసుల సుఖసంతోషాల కోసం ప్రార్థించారు. అనంతరం కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ, మైసమ్మ తల్లి దీవెనలతో గచ్చిబౌలి డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పెద్దగోని రమేష్ గౌడ్, అంజమ్మ, శంకర్, వెంకటేష్, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## మియాపూర్ సర్కిల్ 48లో ప్రజావాణి

- పలు విభాగాలపై - 8 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిసి- డి. శశిరేఖ

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్కిల్ 48 మియాపూర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 8 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి 4, టౌన్ ప్లానింగ్ విభాగానికి 2, రెవెన్యూ విభాగానికి 1, హెల్త్ & శానిటేషన్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయి. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, అర్బన్ బయో డైవర్సిటీ, ఎలక్ట్రికల్, అన్ని సెక్షన్ల విభాగాలకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిసి శశిరేఖ ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు.

**శాఖల వారీగా ఫిర్యాదులు:**

టౌన్ ప్లానింగ్ 2, రెవెన్యూ 1, హెల్త్ & శానిటేషన్ 1, ఇంజనీరింగ్ 4, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ 0, అర్బన్ బయో డైవర్సిటీ 0, ఎలక్ట్రికల్ 0, అన్ని సెక్షన్లు 0, మొత్తం 8.

## అభివృద్ధే ధ్యేయంరాగం నాగేందర్, ఎమ్మెల్యే గాంధీ చేతుల మీదుగా పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రాగం, ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** శేరిలింగంపల్లి డివిజన్‌లోని కేఎంఆర్ ఎస్టేట్స్ వద్ద రూ.62.50 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "డివిజన్ అభివృద్ధే నా లక్ష్యం, నా ధ్యేయం. స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకే ఈ పనులు చేపట్టాం" అని తెలిపారు. నిత్యం డ్రైనేజీ పొంగే ప్రాంతాల్లో ప్రాధాన్యతగా పనులు పూర్తి చేసి, కాలనీలను సమస్య రహిత ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి ఈడీ సంతోష్ రెడ్డి, జీఎం కృష్ణ, డిజిఎం శ్రీహరి, మేనేజర్ సందీప్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, కేఎంఆర్ ఎస్టేట్స్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బాబిరెడ్డి, సెక్రటరీ వేణుబాబు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సేవా బాటలో జన్మదినం

- సంజీవ రెడ్డిని అభినందించిన జగదీశ్వర్ గౌడ్




సంజీవరెడ్డిని శాలువాతో సత్కరించి కేక్ కోస్తున్న జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షుడు, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకుడు నల్ల సంజీవ రెడ్డి జన్మదిన వేడుకల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. మయూరి నగర్‌లో శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్, సంజీవ రెడ్డి కలిసి చిన్నారులకు భోజనం వడ్డించారు. సేవా మార్గంలో జన్మదినం జరుపుకోవడం అభినందనీయమని, సంజీవ రెడ్డి నిత్యం కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని జగదీశ్వర్ గౌడ్ కొనియాడారు. ఈ సందర్భంగా సంజీవ రెడ్డిని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్ గౌడ్, కృష్ణ ముదిరాజ్, మన్నేపల్లి సాంబశివ రావు, మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కట్ల శేఖర్ రెడ్డి, సంగీత గౌడ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఆ విషయంలో కఠినంగా ఉంటున్నా..

దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవడం, స్టార్‌డమ్ ఉండగానే నాలుగు డబ్బులు వెనకేసుకొని సెటిల్ అయిపోవడం హీరోయిన్లకు పరిపాటే. కానీ మృణాళ్‌ఠాకూర్ మాత్రం అందుకు భిన్నంగా ఆలోచిస్తున్నది. స్టార్ హీరో సినిమా అయినా సరే.. పారితోషికం భారీగా ముట్టజెబుతామన్నా సరే.. పాత్ర నచ్చకపోతే 'నో' చెప్పేస్తానని నిర్మొహమాటంగా చెప్పేసింది మృణాళ్‌ఠాకూర్. 'నటికి సంతృప్తి అవసరం. 'సీతారామం'లో సీతామహాలక్ష్మి పాత్ర, 'హాయ్ నాన్న'లో యష్ణ పాత్ర నా కెరీర్‌కి ఓ గౌరవాన్ని కట్టబెట్టాయి.ఏమాత్రం ప్రాధాన్యత లేని కమర్షియల్ రోల్స్ చేసి ఆ గౌరవాన్ని పోగొట్టుకోలేను. అందుకే కథలు వినే విషయంలో కాస్తంత కఠినంగానే ఉంటున్నా. డబ్బుకోసమో, లేక పెద్ద సంస్థ అనో కళ్లు మూసుకొని సంతకం చేయట్లేదు. కథలో లోతు, పాత్రలో బలం ఉందనిపిస్తేనే 'ఓకే' చెబుతున్నా. రీసెంట్‌గా వచ్చిన 'డెకాయిట్' సినిమాలోని పాత్రను కూడా ప్రాధాన్యతను బట్టే 'ఎస్' చెప్పాను. అనుకున్నట్టే ఆ పాత్రకు మంచి స్పందన వస్తున్నది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది మృణాళ్‌ఠాకూర్.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.